

కు.నికి కొత్త మందు

అందుబాటులోకి ఇంజక్షన్

ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితం

ప్రచారం లేక ఈ విధానం అమలులో జాప్యం

- వివరాలు 8లో..



కలవాలి చేతులు..
ఫలించాలి ఆశలు

- నిరుపయోగంగా ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు
- మెగా ఇండస్ట్రియల్ పార్కుకు అవకాశం
- ఎట్టకేలకు తొలగిన కోర్టు సమస్యలు
- ఉపాధి కోసం రైతుల ఎదురుచూపు

8

పరిశ్రమలు వస్తాయని.. ఉపాధి లభిస్తుందని.. జీవితాలు మెరుగుపడతాయని మూడు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న ఇఫ్కో కిసాన్ సెజ్ బాధితులకు నిరాశే ఎదురవుతోంది. రెండు దశాబ్దాలపాటు కోర్టుల్లో నడిచిన కేసులు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయని సంతోషించాలో లేదా కేసులు క్లియర్ అయిన తర్వాత కూడా పరిశ్రమల ఏర్పాటులో అడుగులు ముందుకు పడడం లేదని బాధపడాలో అర్థం కావడం లేదని బాధిత రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కిసాన్ సెజ్ భూములపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నతస్థాయిలో సమీక్షించి, కీలక నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'సోమశిల'లో
74.037 టీఎంసీల నిల్వ

అనంతసాగరం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం 74.037 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి 6,343 క్యూసెక్కుల ప్రవాహం డ్యాంలోకి వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 250, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాంలో 58.02 టీఎంసీల నీరు ఉంది. సోమశిల నుంచి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 680 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



అధికారులతో తమ గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా రైతులు

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం
కల్పిస్తేనే భూములిస్తాం!

- ఉన్న భూములు లాగేసుకుంటే ఎలా బతకాలి!?
- మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాల్సిందే
- తేల్చి చెప్పిన చెన్నాయపాలెం రైతులు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు

8

రైతుబజార్లలో అన్నదాతలకు
ఉచితంగా దుకాణాలు

● మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు బజార్లలో వ్యాపారాలు సాగించాలని ఆసక్తి కలిగిన రైతులకు ఉచితంగా దుకాణాలు కేటాయిస్తామని మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత చెప్పారు. రైతుల్లేని బజార్లు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. జిల్లాలోని రైతుబజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే రైతులు ఈ-పంట నమోదు చేసుకుని ఉండాలని పేర్కొన్నారు. కావలిలో రైతుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో దుకాణాలు సరిపోవడం లేదని, అక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. నెల్లూరులో వ్యాపారాలు సాగించేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులకు రైతు బజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను కేటాయించాలని జాయింట్ కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వస్తే దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.




ఆ రూట్‌లో వెళితే
దుమ్ము కొట్టుకోవాల్సిందే!


- కావలి- వింజమూరు రహదారి అంటేనే హడలిపోతున్న వాహనదారులు

కావలి నుంచి వింజమూరు మీదుగా సీతారామపురం వెళ్లే జాతీయ రహదారి అంటే వాహనదారులే కాదు.. ప్రజలు కూడా హడలి పోతున్నారు. ఈ మార్గంలో కనీసం ఆటో వెళ్లినా రేగుతున్న దుమ్ము కంటిలో నలుసుగా మారిపోతోంది. రహదారి పనుల్లో నాణ్యత లోపించడమే ఇందుకు కారణంగా స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పనుల్లో వినియోగిస్తున్న గ్రావెల్ నుంచి దుమ్ము లేస్తుండటంతో ఎదుట వాహనాలు కనబడక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అంతేగాక కొన్నిచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇవి కూడా ప్రమాదాలు నిలయాలుగా మారాయి. ఇక చిన్నపాటి వర్షానికే మార్జిన్‌లో మట్టి కోతకు గురవుతోంది. ఇటు ప్రజలు, అటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా స్థానిక అధికారులు పట్టీపట్టునట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టడమేగాకుండా దుమ్ము లేవకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో నీళ్లు చల్లాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే వీలైనంత వరకు పనులు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

- వింజమూరు (ఆంధ్రజ్యోతి)

ఎప్పుడిస్తారో!?





- పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతుల ఎదురుచూపు
- మూడు నెలల క్రితమే జిల్లాకు చేరిన పుస్తకాలు
- అప్పటి నుంచి రెవెన్యూ బీరువాల్లోనే..
- అనేక పుస్తకాల్లో తప్పులు రావడంతోనే పంపిణీ ఆలస్యం

నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో రైతు పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోను ముద్రించి ఇవ్వడాన్ని నాడు రైతులు ఎంత తీవ్రంగా వ్యతిరేకించారో అందరికీ తెలిసిందే. తమ భూమి పత్రంపై మరొకరి ఫొటో ఏమిటంటూ నాడు రైతులు గళమెత్తారు. గత ఎన్నికల్లో ఈ అంశం కూడా విపక్షాలకు పెద్ద ప్రచార అస్త్రంగా మారింది. తాము అధికారంలోకి వస్తే రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించి ఇస్తామని ఎన్డీఏ కూటమి హామీ కూడా ఇచ్చింది. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే పాత పాసు పుస్తకాల స్థానంలో కొత్తవి ఇచ్చేందుకు నిర్ణయించింది. రాజముద్రతో కూడిన నూతన పాసుపుస్తకాలను ముద్రించి కొన్ని నెలల క్రితం జిల్లాకు పంపింది. గడిచిన మూడు, నాలుగు నెలల నుంచి దఫాల వారీగా ఈ పాసుపస్తకాలు జిల్లాకు చేరాయి. అయితే, రోజులు గడుస్తున్నా వాటి పంపిణీ మాత్రం జరగడం లేదు. అవన్నీ రెవెన్యూ కార్యాలయాల్లోని బీరువాలు, రికార్డుల రూముల్లో మూలుగుతున్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకే కొత్త పాసుపుస్తకాలను ముద్రించారు. 235 గ్రామాల్లోని 1,05,620 మంది రైతులకు సంబంధించిన పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. కొన్ని ఆర్డీవో కార్యాలయాల్లోను, మరికొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ఉన్నాయి. వీటిని ఎందుకు పంపిణీ చేయడం లేదని అడిగితే మాకు ఇంకా ఆదేశాలు రాలేదంటూ సమాధానమిస్తున్నారు. రూ.కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేసి నూతన పాసుపుస్తకాలు ముద్రించాక వాటిని రైతులకు అందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇన్నేసి పుస్తకాలు కార్యాలయాల్లో ఉండటం రెవెన్యూ సిబ్బందిని ఆందోళనకు గురిచేస్తోంది. వాటిని ఎక్కడ ఎలుకలు నాశనం చేస్తాయో లేక ఎక్కడ దెబ్బతింటాయోనని భయపడుతున్నారు. అయితే చాలా పాసుపుస్తకాల్లో తప్పులు ఉండటంతోనే పంపిణీ ప్రక్రియ ఆలస్యం జరుగుతోందన్న ప్రచారం జరుగుతోంది. వేల పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లినట్లు రెవన్యూ వర్గాలు చెబుతున్నాయి. వాటిని సరిచేశాకనే పంపిణీ చేసే అవకాశమున్నట్లు భావిస్తున్నారు. మరి ఇదంతా ఎప్పటికి జరుగుతుందో చూడాలి.

ఆ చదువుల తల్లికి
ఏమైంది!?

'జవహర్ నవోదయ'లో విద్యార్థిని ఆత్మహత్య

6



ప్రణీత (ఫైల్)

చదువులోనే కాదు.. క్రీడల్లోనూ ఆ విద్యార్థిని ఘనత అమోఘం. ఆమె ప్రతిభను సహచర విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ ప్రశంసలు కురిపిస్తారు. ముందు రోజు రాత్రి కూడా తన తండ్రితో ఎంతో సంతోషంగా మాట్లాడిన బాలికకు ఏమైందో ఏమో ఉరికి వేలాడింది. మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థిని ప్రణీత బుధవారం తెల్లవారుజామున మెట్ల గ్రిల్స్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యాలయానికి చేరుకుని గుండెల విసేలా రోదించారు. తన కుమార్తె ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని విద్యార్థిని తండ్రి రవి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అన్నదాత సఖీభవ - పీఎం కిసాన్ మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, తదితరులు

రైతాంగం సంక్షేమమే
ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- సోమశిల హైలెవల్ కెనాల్‌ను త్వరగా పూర్తి చేస్తాం
- దేవదాయ శాఖ మంత్రి ఆనం వెల్లడి
- లబ్ధిదారుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నగదు జమ

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2025-26 రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు చెక్కులను ఆవిష్కరించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి మంత్రి ఆనం పాల్గొని మాట్లాడారు. జిల్లా స్థాయిలో 1,96,866 మంది రైతులకు రూ.130.20 కోట్లు లబ్ధి చేకూరిందని అన్నారు. రైతులకు అండగా ఉంటూ, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రజలు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంత రైతుల కోసం సోమశిల హైలెవల్ కెనాల్ పనులను మొదలు పెట్టేందుకు, ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఎంపీ వేమిరెడ్డితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ రెండు సమస్యలపై ఇప్పటికే సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయితే మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని, 90 వేల మందికి తాగునీరు, 65 వేల ఎకరాలకు సాగునీరు అందుతాయని తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా సంక్షేమం, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం పీ-4 కార్యక్రమంలో భాగంగా తన కుమార్తె ఆనం కైవల్యారెడ్డి దత్తత తీసుకున్న బంగారు కుటుంబం బొమ్మిరెడ్డి బాలు యోగ క్షేమాలను మంత్రి ఆనం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, ఆర్డీవో పావని, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీకి
మోక్షం



నెల్లూరు నగరంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు (ఫైల్)

- నగరంలో మిగిలిన పనులు చేపట్టేందుకు టెండర్లు
- రూ.110 కోట్లతో ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్
- నెల్లూరు సర్కిల్‌కు రూ.450 కోట్ల యూఐడీఎఫ్ నిధులు
- ఏడు మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పనులు

నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆరేళ్లుగా భూగర్భ డ్రైనేజీ పథకానికి (యూజీడీ) పట్టిన గ్రహణం వీడింది. ఎట్టకేలకు నెల్లూరు నగరంలో అసంపూర్తి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. యూజీడీతోపాటు అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకం పనులనూ పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(యూఐడీఎఫ్) నిధులతో పబ్లిక్ హెల్త్ అధికారులు తాజాగా టెండర్లు ఆహ్వానించారు. పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.450 కోట్లు మంజూరయ్యాయి. ఈ సర్కిల్ పరిధిలోని ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలోని మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పనులు, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నారు. నెల్లూరు, కావలి, కందుకూరు, గూడూరు, సూళ్లూరుపేట, పుత్తూరు, చిత్తూరు మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పథకాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు టెండర్లు ఆహ్వానించారు. అలానే నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు సూళ్లూరుపేటలో మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచే పనులను ఆ టెండర్‌లోనే కలిపారు. ఒక్క నెల్లూరు యూజీడీ పనులకే సుమారు రూ.110 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేయనున్నట్లు పబ్లిక్ హెల్త్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి టెండర్ల దాఖలుకు బుధవారం గడువు ముగిసింది. టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసిన అధికారులు.. మరో 3, 4 రోజుల్లో ప్రైస్ బిడ్ ఓపెన్ చేయనున్నారు. ఆ తర్వాత అగ్రిమెంట్ చేసుకొని పనులు మొదలు పెట్టనున్నారు. మరో నెల రోజుల్లో యూజీడీ, తాగునీటి అసంపూర్తి పనులు మొదలుపెట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రెండేళ్లలోపు ఈ పనులన్నింటినీ పూర్తి చేసి బృహత్తర పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● వైసీపీ హయాంలో నిర్వీర్యం

నెల్లూరు నగరంలో యూజీడీ, తాగునీటి పథకాల నిర్మాణాలకు 2016లో అంకురార్పణ జరిగింది. రూ.645 కోట్లతో 420 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, 2019 ఎన్నికల నాటికే 390 కి.మీ పూర్తి చేశారు. అలానే జనార్దన్‌రెడ్డి కాలనీ, అల్లీపురం, డ్రైవర్స్ కాలనీ, పొట్టేపాలెం వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాలను కూడా నాడే నిర్మించారు. మొత్తంగా 85 శాతం మేర యూజీడీ పనులు పూర్తయ్యాయి. అలానే ఇంటింటికీ మంచినీటిని కుళాయిల ద్వారా అందించే పథకాన్ని రూ.512 కోట్లతో చేపట్టారు. 724 కి.మీ మేర పైపులైన్ నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. ఈ పథకం పనులు కూడా దాదాపు 95 శాతం మేర పూర్తయ్యాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక యూజీడీ, తాగునీటి పథకం పనులకు బ్రేకులు పడ్డాయి. సుమారు రూ.వెయ్యి కోట్లు అప్పటికే ఖర్చు చేసినా నాటి సర్కారు మిగిలిన పూర్తి చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో యూజీడీ, తాగునీటి పథకాల పనుల్లో కదలిక వచ్చింది.

టెన్త్ పరీక్షల నిర్వహణలో మార్పులు

- యూడైస్ నుంచే విద్యార్థుల వివరాలు
- పాఠశాలల్లోనే పరీక్ష కేంద్రాల ఏర్పాట్లు

నెల్లూరు (విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పలు మార్పులు చేపడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల వివరాలన్నీ యూడైస్ నుంచి సేకరించడంతో పాటు నియమ, నిబంధనలను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం పర్యవేక్షించనుంది. పరీక్ష కేంద్రాలను విద్యార్థులు సులువుగా గుర్తించేందుకు హాల్‌టికెట్లపై లోకేషన్ క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నారు. అలాగే మాన్యువల్ నామినల్ రోల్‌కు స్వస్తి పలుకుతూ విద్యార్థుల వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో హెచ్‌ఎంలు యూడైస్ నుంచి తీసుకుని రాష్ట్ర పరీక్షల కార్యాలయం నుంచే నామినల్ రోల్ తయారు చేయనున్నారు. విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేయడంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లు, వయసు, సబ్జెక్ట్ తదితర వివరాలను సరిచేసి పరీక్ష ఫీజు చెల్లించాలని, ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

> **గత తప్పిదాలు జరగకూడదనే..**
>
> గత తప్పిదాలు పునరావృతం కాకుండా విద్యాశాఖ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. విద్యార్థుల వివరాలన్నీ యూడైస్ నుంచి సేకరించడంతోపాటు సిబ్బంది నియామకాలను డైరెక్టర్ కార్యాలయమే చేపట్టనున్నారు. విద్యార్థులు వివరాలన్నీ కూడా వారి తల్లిదండ్రుల పూర్తి ఆమోదంతోనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో టెన్త్ పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన రూ.125 మాత్రమే వసూలు చేయాలి. అంతకంటే అధికంగా వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులే నేరుగా ఫీజు చెల్లించేలా త్వరలో యాప్‌ను కూడా విడుదల చేయనున్నారు.
>
> - జానకి రామయ్య, జిల్లా పరీక్షల విభాగం ఏడీ

● అన్నీ పరిశీలించాకే..

పరీక్షల నిర్వహణ కేంద్రాల నుంచే అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సిబ్బంది నియామకాలు కూడా ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం చేపడుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, మరో ఇద్దరు అధికారులు పాఠశాలలను, స్థానిక వసతులను పరిశీలించి పరీక్ష కేంద్రాలను నిర్ధారించాలి. వీటిని పరిశీలించిన ఉన్నతాధికారులు కమిటీ నిర్ణయించిన రీతిలో ఎంపిక చేసిన పాఠశాలలనే పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు సంబంధించిన చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్ల నియామకాలన్నీ రాష్ట్ర కార్యాలయం నుంచే చేపట్టనున్నారు. దీనికి సంబంధించి గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో తీసుకుని నియామకాల అనంతరం జాబితాను జిల్లాకు పంపించనున్నారు. అదేవిధంగా ఇంటర్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలల్లోనే పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

స్మార్ట్ మీటర్లపై
ప్రజల్లో అపోహలు తొలగించండి

● విద్యుత్ ఎస్‌ఈ రాఘువేంద్రం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని, అన్నీ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రాఘవేంద్రం అధికారులను ఆదేశించారు. నెల్లూరు పట్టణ డివిజన్‌కు సంబంధించి విద్యుత్ భవన్‌లో ఆయన బుధవారం సమీక్ష జరిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఎలాంటి అదనపు చార్జీల భారం పడదని, మీటర్ బిగింపు సమయంలో ఎలాంటి ఖర్చులు కూడా ఉండవని ప్రజలకు తెలియజేయాలన్నారు. లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గృహాలకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ కల్పించినందున దీనిపై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఈఈలు సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు సీహెచ్‌సీ గైనకాలజిస్టుగా ఇందీవరి

పొదలకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు డాక్టర్‌గా ఇందీవరి బాధ్యతలు చేపట్టారు. నూతనంగా విధుల్లో చేరిన ఆమెను ఆసుపత్రి సిబ్బంది, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ అభినందనలు తెలిపారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11835
వెండి కిలో ధర	రూ. 160800
వెండి ఒక గ్రాము	రూ. 165.80

చదువుకు చేయూత

- ఆ పరీక్షలో ప్రతిభ చాటితేచాలు..
- నాలుగేళ్లపాటు ఉపకార వేతనం
- వచ్చేనెల 7న ఎన్‌ఎంఎంఎస్ ఎగ్జామ్



మనుబోలు బాలుర పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

మనుబోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఉన్నా, ఆర్థిక పరిస్థితులు సరిగాలేక కొంత మంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక పోతున్నారు. ఇలాంటి విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. వీరి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పథకాన్ని తీసుకువచ్చింది. ఇందులో అర్హులు కావాలంటే ఏడాదికోసారి నిర్వహించే ప్రతిభా పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. అర్హత సాధించిన విద్యార్థులకు నాలుగేళ్లపాటు నెలకో రూ. వెయ్యి చొప్పున ఏడాదికి రూ. 12వేలు ఇస్తారు. ఈ అవకాశం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారికి మాత్రమే.

● 2023 నుంచి అమలు

ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకువచ్చింది. జిల్లావ్యాప్తంగా ఎన్‌ఎంఎంఎస్ పథకానికి 2023- 24 లో 3246మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు 200మంది. 20 24-25 లో 3809మంది దరఖాస్తు చేసుకోగా 199మంది విజయం సాధించి ఉపకార వేతనాలు పొందుతున్నారు. ఇక ఈ ఏడాది 3545 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

● డిసెంబర్ 7న పరీక్ష

ప్రతి ఏటా డిసెంబర్‌లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులు. ఈ ఏడాది పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులు అర్హత సాధించాలని నెల ముందు నుంచే ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. డిసెంబరు 7న పరీక్ష నిర్వహిస్తారు.

● ఏడాదికి రూ.12వేలు

ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థికి ఏడాదికి రూ. 12వేలు అందుతుంది. 8వ తరగతిలో పరీక్షరాసి అర్హత సాధించిన విద్యార్థికి 9,10,ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువు ముగిసే వరకు ఆర్థికసాయం కొనసాగుతుంది. అంటే నాలుగేళ్లపాటు విద్యార్థి బ్యాంకు ఖాతాలో రూ. 48వేలు వరకు కేంద్రప్రభుత్వం జమచేస్తుంది.

● ప్రశ్నపత్రం ఇలా...

ప్రతిభా పరీక్ష ప్రశ్నపత్రంలో అన్ని బహుళైచ్ఛిక ప్రశ్నలే ఉంటాయి. ఇవి 180వరకు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ(మ్యాట్), స్కాలాస్టిక్ ఎబిలిటి (శాట్), 7,8 తరగతులకు సంబంధించిన గణితం, సైన్స్, సాంఘిక శాస్త్ర పాఠాల ప్రశ్నలే ఉంటాయి. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగానే పథకానికి ఎంపిక చేస్తారు. మరింతగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తే ఎక్కువ మంది పేద విద్యార్థులు ఈ ఉపకారవేతనం అందుకునే అవకాశం ఉంటుంది.

గతేడాది నేను ఎంపికయ్యా...



నేను మడమనూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. గతేడాది 8వ తరగతిలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాశా. ఉపకార వేతనానికి ఎంపికయ్యా. అప్పుడు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పరీక్షకోసం శిక్షణ ఇచ్చారు. ఉదయం, సాయంత్రం గణితం, సైన్స్‌పై సాధన చేశా. నాకు వచ్చిన సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుని పరీక్ష రాసి విజయంసాధించా. ఇప్పుడు నాకు ప్రతినెలా రూ.వెయ్యి స్కాలర్‌షిప్ అందుతోంది.

\- ఇరగరాజు కుసుమ సుధ



సచివాలయాలపై నిరంతర పర్యవేక్షణ

● ఎంపీడీవో కే. జలజాక్షి

మనుబోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న 14 సచివాలయాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎంపీడీవో కే జలజాక్షి బుధవారం తెలిపారు.

? : సచివాలయాల్లో సిబ్బంది కొరత లేదా..

! : 14 సచివాలయాల్లో 108మంది పని చేస్తున్నారు. గతంలో మాదిరిగా ఒక్కో సచివాలయానికి 11 పోస్టులు లేవు. ఎక్కడ ఏ పోస్టు అవసరం ఉందో, ఆ పోస్టులలో మాత్రమే నియమించారు.

? : వయోజనులకు విద్యను అందించే ఉల్లాస్ నిర్వహిస్తున్నారా.

! : 19 పంచాయతీల్లో 235 మంది వలంటీర్ల చేత ఉల్లాస్ నిర్వహణ జరుగుతోంది. సాయంత్రం పూట చదువురాని వయోజనులకు ఈ కార్యక్రమం ద్వారా బోధన జరుగుతోంది.

? : పంచాయతీల్లో కార్యదర్శుల కొరత ఉందా.

! : 3 పంచాయతీలకు కార్యదర్శులు లేరు. జట్లకొండూరుకు బండేపల్లి, మడమనూరుకు కొలనుకుదురు, వీరంపల్లి పంచాయతీలకు పిడూరు కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా వేశాం.

? : గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు సరిపడా ఎందుకు లేరు.

! : మండలంలో అన్ని పంచాయతీల్లో కలిపి 50మంది వరకు గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు. ఇప్పుడు వారి జీతాలు పంచాయతీలే ఇవ్వాలి. గతంలో లాగా ప్రభుత్వం నుంచి ఇవ్వడం లేదు. పంచాయతీల్లో అవసరాలను బట్టి ఆయా పంచాయతీల తీర్మానం ప్రకారం నియమించుకోవాలి.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అదానీ విద్యామందిర్ విద్యార్థి ఎంపిక



ఆనంద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ముత్తుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు కృష్ణపట్నం పోర్టులోని అదానీ విద్యామందిర్ ఇంటర్ విద్యార్థి ఆనంద్ ఎంపికయ్యాడు. గుంటూరు జిల్లాలోని వినుకొండలో జరిగిన అండర్ 19 కబడ్డీ పోటీలలో గెలిచిన జట్టు నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు ఆనంద్ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారు లక్ష్యాలను చేరుకోవడానికి అదానీ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. విద్యార్థి ఆనంద్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

రాపూరును చెత్త రహిత మండలంగా తీర్చిదిద్దాలి



పంచాయతీ సిబ్బందితో ఎంపీడీవో భవాని

రాపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చెత్త రహిత మండలంగా రాపూరును తీర్చిదిద్దాలని మండల ప్రజా పరిషత్ అధికారిణి మారెళ్ల భవాని తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజెస్ (థీమ్-5) ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల జీవనజ్యోతి పీఎంజేజేబీవై

రాపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా నిరాశ్రయ కుటుంబాలకు అండగా నిలుస్తుందని కెనరా బ్యాంకు మేనేజర్ శివనాగిరెడ్డి అన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన కెనరా బ్యాంకు ఖాతాదారుల కుటుంబాలకు బుధవారం ఆయన బీమా చెక్కులు పంపిణీ చేశారు. రాపూరు మండలం గుండవోలు గ్రామానికి చెందిన ఎం విజయలక్ష్మి, బి.ప్రవీణ్ కుటుంబాలకు రెండు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నవీన్‌కుమార్, అనంతసాగరం సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ హబీబున్నీసా, గిరిబాబు, షారుక్, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ప్రజాదర్బార్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కోవూరు నియోజకవర్గంలో నాయకులు, అధికారులు ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. అనంతరం రెవెన్యూ, డ్రైయిన్స్, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, నీటిపారుదల శాఖ, మున్సిపాలిటీలో సమస్యలపై బీజేపీ నాయకులు ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. మున్సిపాలిటీలో సమస్యలపై 20 రోజుల్లో నివేదికను తమకు సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. సుమారు వంద వినతులను ఎమ్మెల్యే స్వీకరించగా, ప్రతి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, రూ.2.25 కోట్లతో నిర్మించనున్న అగ్నిమాపక కేంద్రానికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావులేకుండా భవనం నిర్మించాలని అధికారులకు సూచించారు.

● రైతులకు అండగా ఉండండి

సహకార సంఘాలు, అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోరారు.బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకులో జరిగిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. రైతులకు అవసరమైన గోడౌన్లు, ధాన్యం ఆరబెట్టుకునే కల్లాల నిర్మాణాలకు సహకరించాలని కోరారు. అనంతరం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమాలలో అగ్నిమాపక, సహకార శాఖ జిల్లా అధికారులు గురప్ప, తిరుపాల్‌రెడ్డి, రాజశేఖర్, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మంజులమ్మ, హౌసింగ్ ఏఈ పెంచలయ్య, పలు శాఖల అధికారులు, వవ్వేరు, బుచ్చి బ్యాంకుల సీఈవోలు సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, వ్యవసాయాధికారి శ్రీహరి, చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, శివరామకృష్ణారెడ్డి, టీడీపీ నేతలు శ్రీనివాసులు, జగదీష్ పాల్గొన్నారు.

● రూ.1.50 లక్షల ఆర్థిక సాయం

బుచ్చిరెడ్డిపాళెం 18వ వార్డుకు చెందిన షేక్ మసూద్ అనారోగ్యంతో బాధపడుతుండగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.1.50 లక్షలు ఆర్థిక సాయాన్ని తన అనుచరుల ద్వారా బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు.

‘సంక్షేమం’ అమలులో ఏపీ నంబర్‌వన్



రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ చెక్కును పంపిణీ చేస్తున్న సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నెంబర్ వన్‌గా నిలిచిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో 28వేల మంది రైతులకు రూ.19కోట్ల57వేలు, తోటపల్లిగూడూరు మండలానికి 3970 మంది రైతులకు సుమారు రూ.27కోట్ల7లక్షల90వేలు రెండో విడతలో పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2వేలుతో కలిసి రూ.7వేలు రైతులు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు కొణతం రఘుబాబు, సొసైటీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర, నాయకులు మన్నెం మధుగౌడ్, నెల్లపూడి సుధాకర్ రైతులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నూతన కమిటీ సభ్యులతో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున

ముత్తుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ తెలిపారు. ముత్తుకూరు కార్యాలయంలో బుధవారం ఆయన బీసీ సెల్, మైనార్టీ సెల్ మండల కమిటీలను ప్రకటించారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా పల్లికొండ శ్రీనివాసులు, కార్యదర్శిగా వాంకిల శ్రీనివాసులుయాదవ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా షేక్ కరిముల్లా, కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాషాలను ఎంపిక చేశామన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామ గ్రామానా టీడీపీని పటిష్ట పరిచేందుకు స్థానిక కమిటీలు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాగల శివకృష్ణ, నాయకులు మామిడాల శ్రీనివాసులు, వల్లూరు మోహన్‌రావు, నడవడి ముత్యంగౌడ్, అక్కయ్యగారి ఏడుకొండలు, వేల్పుల నాగార్జున, వావిళ్ల జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



ఆలయంలో దీపాలు వెలగిస్తున్న మహిళలు

విడవలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో వెలసివున్న కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్‌కృష్ణ, ఈవో బొగ్గల మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. తొలుత ఆలయ పూజారి శ్రీకాంత్ శర్మ స్వామి, అమ్మవార్లకి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు రావడంతో రామతీర్థం జనసందోహంగా మారింది. ఆలయం కార్తీక దీపాలతో శోభాయమానంగా మారింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

మాక్ అసెంబ్లీకి తరుణవాయి విద్యార్థిని ఎంపిక

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదివే పాలా పల్లవి మాక్ అసెంబ్లీకి ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పల్లవి ప్రతిభ కనబరిచింది. దీంతో ఆత్మకూరు నియోజకవర్గం తరపున ఈనెల 26వ తేదీన అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి వెళ్లనుంది.

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

కొడవలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాలెంలో ఈఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలసి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన అమలు కార్యక్రమం వీక్షించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా పూడికతీతకు నోచుకోని పంట కాలువలు పూడిక తీసి వారిని ఆదుకున్నామని తెలిపారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌలు రైతులకు, డీకేటీ భూముల్లో సాగు చేసే రైతులకు సైతం యూరియా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, పాశం శ్రీహరిరెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కేతూ వెంకటరమణరెడ్డి, చెక్క మదన్, జొన్న శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై సత్యసాయిబాబా సూక్ష్మచిత్రం



పొదలకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య రావి ఆకుపై సత్యసాయిబాబా సూక్ష్మచిత్రాన్ని గీశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

ఉదయకాళేశ్వరుడి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ చైర్మన్ మాలకొండయ్య

కొడవలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండవరంలో వెలసి ఉన్న గంగా సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్‌గా ఆలం మాలకొండయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా గండవరం పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన వేమిరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. వారిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పట్టాభిరామిరెడ్డిలు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, చీకటి ప్రదీప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

ఇందుకూరుపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో ఏడురోజులుగా ఇందుకూరుపేట కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆశ్రమ కోఆర్డినేటర్ గుణపాటి ప్రసాద్‌రెడ్డి, సేవా ఎగ్జిక్యూటివ్ కందికట్టు రాజేశ్వరి, సభ్యురాలు గంట విజయశ్రీలు గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. పొనక కనకమ్మ విగ్రహానికి ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, నారాయణ పట్టు వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. వైద్య శిబిరం నిర్వహించి ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పల్లిపాడు సర్పంచు రెడ్డిపోగు సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు.

C.R.I.M.E N.E.W.S

కృష్ణమందిరంలో విగ్రహం చోరీ

● గంటల వ్యవధిలో నిందితుడి పట్టివేత



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ వైవి సోమయ్య

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణమందిరంలో పంచలోహ విగ్రహం చోరీ చేసిన గంటల వ్యవధిలో పోలీసులు నిందితులను అరెస్టు చేసి, విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంతపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య విలేకర్లతో మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. నగరంలోని కామాటివీధిలో సంతాన బాలగోపాల కృష్ణమందిరం ఉంది. వాచ్‌మన్ అంకయ్య ఎప్పటిలానే బుధవారం ఉదయం ఆలయం గేట్లు తెరిచి పనులు చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని దుండగుడు ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలోని పంచలోహ కృష్ణుడి విగ్రహం, ఇత్తడి గంటలను దోచుకెళ్లాడు. అర్చన చేసేందుకు పూజారి రఘునందన్ గుడికి వచ్చి గర్భగుడిలోకి వెళ్లిచూడగా స్వామి వారి ఉత్సవ విగ్రహం, ఇత్తడి గంటలు కనిపించలేదు. దీంతో విషయాన్ని ఆలయ చైర్మన్ భాస్కర్‌కు తెలియజేశారు. భాస్కర్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య సంఘటనా స్థలానికి చేరుకొని చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని సీసీఫుటేజీల ఆధారంగా నిందితుడు కొడవలూరు మండలం నార్తురాజుపాలేనికి చెందిన పాతనేరస్థుడు వెంకయ్యగా గుర్తించారు. గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా విగ్రహాన్ని కోటమిట్ట ప్రాంతానికి చెందిన షేక్ షఫీకి విక్రయించినట్లు పేర్కొన్నారు. దీంతో పోలీసులు షఫీని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వెంకయ్యపై చీరాల రైల్వే పోలీసుస్టేషన్‌లో, ఒంగోలు తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో చోరీ కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను గంటల వ్యవధిలో అరెస్టు చేసిన ఇన్‌స్పెక్టర్ సోమయ్య, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

మద్యం మత్తులో వాహనంతో యువకుడి హల్‌చల్

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ యువకుడు మద్యం సేవించి టాటా మ్యాజిక్ వాహనంతో హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా మద్యం సేవించి వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గల మెకానిక్ షెడ్ దగ్గర నిలిపి ఉన్న టాటా మ్యాజిక్ వాహనాన్ని నడుపుతూ 167-బీజీ జాతీయ రహదారిపై సీతారామపురం మార్గం వైపు వెళ్లి ఆర్టీసీ డిపో మీదుగా తిరిగి పట్టణంలోకి ప్రవేశించాడు. శివాలయం వద్ద ఉన్న అయ్యప్పస్వాముల గ్రామోత్సవంపైకి వేగంగా వాహనంతో దూసుకెళ్లాడు. ఒక కారు, డీజే వాహనాన్ని ఢీకొట్టాడు. గ్రామోత్సవంలో ఉన్న అయ్యప్పస్వాములు ఆ సమయంలో పక్కకు వెళ్లి ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారాన్ని పోలీసులు అందజేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మహబూబ్‌బాషా, వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతనిపై కేసు నమోదు చేశారు.

ఆ చదువుల తల్లికి ఏమైంది!?

- ‘జవహర్ నవోదయ’లో విద్యార్థిని ఆత్మహత్య
- అనుమానిస్తున్న మృతురాలి తండ్రి
- పూర్తిస్థాయిలో విచారించాలని వేడుకోలు

మర్రిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కావలి మండలం అటవి రాజుపాలెం గ్రామానికి చెందిన రవికుమార్, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. రవికుమార్ కొండాపురం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద కుమార్తె ప్రణీత మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది.



జవహర్ నవోదయ విద్యాలయం ముందు తల్లిదండ్రులు

● ఏం జరిగిందో ఏమో..

చదువులో ప్రణీత బాగా రాణిస్తోందని సహచర విద్యార్థులు తెలిపారు. అయితే, ఏం జరిగిందో ఏమో బుధవారం తెల్లవారుజామున విద్యాలయ భవనంలోని మెట్ల గ్రిల్స్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం సిబ్బంది గమనించి విద్యార్థిని తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్ పార్వతి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే విద్యాలయానికి చేరుకున్న వారు తాడుకు వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దించారు. విగతజీవిగా పడిఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువుల గుండెలవిసేలా విలపించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు.

● నా బిడ్డ పిరికిది కాదు..

ఆత్మహత్య చేసుకునేంత పిరికిది తన బిడ్డ కాదని ప్రణీత తండ్రి రవికుమార్ కన్నీటి పర్యంతమయ్యాడు. మంగళవారం రాత్రి 10.20 గంటల ప్రాంతంలో నా బిడ్డ ఫోన్‌లో మాట్లాడింది. ‘నాన్నా... రేపు నీ సబ్జెక్ట్ ఎగ్జామ్ రాస్తున్నానంటే ఆల్ ద బెస్ట్ అమ్మ. బాగా రాయ్.’ అని చెప్పాను. ఆ తర్వాత ఏమైందో ఏమో తెల్లవారుజామున 4 గంటలకు స్కూల్ నుంచి ఫోన్ వచ్చింది. ఉరి వేసుకునేంత పిరికిదికాదు నా బిడ్డ. ఐఏఎస్ కావాలనే ధీమాతో చదువుతోంది. క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో ఆడి విజయాలు సాధించింది. పరీక్షల సమయంలో తోటి వారితో మనస్పర్థలు ఉన్నట్లు గతంలో చెప్పింది. ఏదిఏమైనా నా కుమార్తె మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలి.’ అని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

● విద్యాలయంలోకి నో ఎంట్రీ



పోలీసులను నిలదీస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

విద్యార్థిని మృతితో విద్యాలయంలోకి ఎవరినీ అనుమతించకుండా ప్రధాన గేట్లు మూసివేశారు. దీంతో రహస్యంగా లోపల ఏం జరుగుతుంది. ఎందుకు అనుమతించలేదంటూ విద్యార్థి సంఘం నాయకుడు మహంత్ రెడ్డి తదితరులు ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు.

● నిర్వహణపై పర్యవేక్షణ కరువు?

నవోదయ విద్యాలయ నిర్వహణపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్లో ఫ్యాన్లు మరమ్మతులకు గురైతే పట్టించుకోరు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదంటూ పలుమార్లు విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడ్డారు. నిర్వహణపై ఎవరైనా ప్రశ్నిస్తే కక్షసాధింపులకు దిగుతున్నారని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో భోజనం సక్రమంగా లేకపోవడంతో ఆకలి తీర్చుకునేందుకు కొందరు విద్యార్థులు గోడలు దూకి కృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో ఫాస్ట్ ఫుడ్ షాపులకు వెళ్తున్నారు. ఇలా వెళ్లిన ఇద్దరు విద్యార్థులను ఇటీవల ఇళ్లకు పంపినట్లు సమాచారం. అంతేగాక విద్యాలయంలో బోధన సిబ్బంది దీర్ఘకాలంగా అక్కడే పనిచేస్తుండటంతో గ్రూపులు, వివాదాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రిన్సిపాల్ 6వ తరగతి విద్యార్థిని గోడకేసి కొట్టటంతో తీవ్ర గాయమైంది. తల్లిదండ్రుల ఆందోళనతో ఆమెను సస్పెండ్ చేశారు. ఈ ఘటన మరువక ముందే ప్రణీత మృతి విద్యార్థులలో కలవరం మొదలైంది. గతంలోనూ ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 650



వేదగిరి క్షేత్రంలో ఉడిపి పీఠాధిపతి

నెల్లూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఉడిపి ఆడమారు పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామిజీ బుధవారం వేదగిరి క్షేత్రానికి వచ్చారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చక బృందం స్వాగతం పలికింది. అనంతరం నృసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్ల సన్నిధిలో విశేష పూజలు జరిపించారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు వివరించారు. బద్రినాథ్‌లో చాతుర్మాస వ్రతం పూర్తిచేసుకుని తిరిగి పీఠానికి వెళ్తూ వేదగిరీశుని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని స్వామిజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బ్యారికేడ్

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపు ప్రధాన రహదారి మధ్య ఏర్పాటు చేసిన బ్యారికేడ్ ప్రమాదకరంగా మారింది. కోవూరు వైపు నుంచి నగరంలోకి వస్తున్న వాహనాలు ఢీకొనడంతో బ్యారికేడ్ దెబ్బతిని ఓవైపునకు వాలిపోయింది. దీంతో రంగనాయకులపేట వైపు వెళ్లే ప్రయాణికులకు ఆ బ్యారికేడ్ ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా బ్యారికేడ్ తలకు తగలడమేకాక వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. అలాగే, ఆటో, కారులో వెళ్లే వారు చేతులు బయటపెడితే గాయపడే అవకాశం ఉంది. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా అధికారులు కనీసం పట్టించుకోదని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





ఇటు మరో ప్రమాదం !

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రంగనాయకులపేట పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు డివైడరును గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఇనుప సూచిక బోర్డు ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఢీకొనడంతో ఆ బోర్డు ఓవైపు పదునైన ఇనుప చువ్వగా దర్శనమిస్తోంది. రంగనాయ కులపేట గేటు సెంటర్ నుంచి పాతచెక్‌పోస్టు వైపు వెళ్లే వాహన చోదకులు అధిక శాతం మంది పెట్రోలు పట్టించుకు నేందుకు ఇక్కడి బంకు వైపు వెళుతుంటారు. అయితే మలుపు వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ఆ ఇనుప చువ్వ గుచ్చుకునే ప్రమాదం ఉంది. ఆ చువ్వను తొలగించాలని కొంత మంది వాహన చోదకులు ప్రయత్నించినా కదలని పరిస్థితి. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే దానిని తొలగించాల్సిన అవసరం ఉంది.

ఇంటర్వ్యూ...

యూరియా వాడకం

పెరిగితే అనర్థం

- వర్షాలకు పడిపోతున్న పైరు
- నెల్లూరు రూరల్ మండల ఏవో నాగమోహన్



నెల్లూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకే వరి సాగులో యూరియా వాడకాన్ని తగ్గించడం జరిగిందని, మితిమీరి వాడకం వల్ల అనర్థాలు కలుగుతాయని నెల్లూరు రూరల్ మండల వ్యవసాయ అధికారి ఎస్వీ నాగమోహన్ తెలిపారు. అధిక యూరియా వాడకంతో పైరు ఎదిగి వైపరీత్యాలు సంభవించినపుడు పడిపోతుందని పేర్కొన్నారు. యూరియా వినియోగంపై ఆయన మరిన్ని వివరాలు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు.

? యూరియా మోతాదు తగ్గించడంపై రైతుల్లో అపోహలున్నాయి. మీరేమంటారు.

! ఇప్పటి వరకు రైతులు యూరియాను విచ్చలవిడిగా వాడుతూ వచ్చారు. ప్రతీ సీజన్‌లోనూ మేము అవగాహన కల్పిస్తున్నా ఎక్కువ వాడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన మేరకు ఎకరాకి మూడు బస్తాలే వాడాలని నిర్ణయించాం.

? ఇది రైతులకు ఉపయోగకరమేనా...

! చాలా వరకు ఉపయోగం. దీనిపై రైతులు అవగాహన పెంచుకోవాలని, శాస్త్రవేత్తలు సూచించినది ఎకరాకు 105 కేజీలే!. మూడు బస్తాల ద్వారా రైతులకు అందేది 135 కేజీలు. యూరియాను మితంగా వాడితే ఉపయోగం. ఎక్కువగా వాడితే అనర్థం. అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పేది అన్నదాతలు వినాలి.

? యూరియా అధిక వినియోగంతో కలిగే అనార్థలేమిటి.

! భూమి సహజత్వాన్ని కోల్పోయి చవుడుగా మారిపోతుంది. పైగా పైరు ఎక్కువగా ఎదిగి వైపరీత్యాల సమయంలో పడిపోతుంది. ఖర్చులూ పెరుగుతాయి. చీడ,పీడలను తట్టుకోవడం కష్టమవుతుంది.

? యూరియా కొరత ఉందంటున్నారు... నిజమేనా.

! ఎక్కడా లేదు. ప్రతీ రైతుకు కార్డులు ఇచ్చాము. పైగా ఎకరాకి ఒక బస్తా చొప్పు న ఇప్పటికే పంపిణీ చేశాము. ఇక రెండు బస్తాలివ్వాలి. నారేతలు ఇప్ప టికీ మొదలు కాలేదు. ఈ ప్రక్రియ మొదలయ్యాక 40 రోజుల్లోపు మూడు దఫాలుగా మూడు బస్తాలు వాడాలి.

? ఎరువులు సమృద్ధిగా ఉన్నాయా...

! కాంప్లెక్స్ ఎరువులు రైతులకు పూర్తి అందుబాటులో ఉన్నాయి. వారికి ఏది కావాలన్నా తీసుకెళ్లవచ్చు. ఈసారి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ఎరువులను పంపిణీ చేస్తోంది. కొరతకు తావులేదు. మేము నిత్యం గ్రామాల వారీగా పర్యవేక్షిస్తున్నాం.

? ఈ సీజన్‌లో ఏఏ వరి వంగడాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

! రైతులు ఎక్కువగా కేఎన్ఎం 1638 రకానికి, ఆ తరువాత బీపీటీ 5204 రకానికి ప్రాధాన్యత ఇచ్చి విత్తనాలు పోస్తున్నారు. ఈసారి కొందరు కొత్తదైన కేఎన్ఎం 755ను సాగు చేస్తున్నారు. ఎన్ఎల్ఆర్ 34449 రకం తక్కువగా వేస్తున్నారు.

\- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

కండలేరు జలాశయంపై నిర్లక్ష్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ అన్నారు. దీనిపై బుధవారం నగరంలో తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ ఈ సుబ్రహ్మణ్యేశ్వర రావుకు వినతి పత్రం ఇచ్చారు. నెల్లూరు జిల్లాకు భగీదారి అవార్డు రావడం ఆనందంగా ఉందని, అయితే కండలేరు డ్యామ్ బలహీనపడటం బాధాకరమన్నారు. డ్యామ్ రివిట్మెంట్‌లో చెట్లు పెరిగాయ ని, మట్టికట్ట బయట భాగంలో పిచ్చిచెట్లు అడివిని తలపిస్తున్నాయని చెప్పారు. మట్టికట్టను వెడల్పు చేసి పటిష్టం చేయమని డ్యామ్ సేఫ్టీ సెల్ ఆదేశిస్తే అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, అల్లూరు నాగేంద్ర సింగ్, చిట్టిబాబు శ్రీనివాసులు, చింతగింజల సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల సుధాకర్ వెల్లడి



ఆర్టీసీ కూడలిలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల సుధాకర్ అన్నారు. బుధవారం ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు నగరంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న ఇందిర విగ్రహానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, మోహన్‌రెడ్డి, సంజయ్‌కుమార్, ఇర్ఫాన్, మల్లికార్జునరెడ్డి, ధనుంజయ్, బద్రి పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి ప్రదాత ఇందిరమ్మ..

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఉపగ్రంథ పాలకురాలు ఎస్ సునీత అధ్యక్షత వహించారు. విశ్రాంత గ్రంథ పాలకురా లు ఆమంచర్ల రేవతి మాట్లాడుతూ ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని నేటి సమాజంలో మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న అధికారులు

ఈ కార్యక్రమంలో 7వతరగతి విద్యార్థిని షేక్ సనా మహిళా అభ్యుద యం, మహిళలకు సమాన అవకాశాలపై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా తెలిపారు.

సీఎం సమర్థత వల్లే సంక్షేమం, అభివృద్ధి

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు సమర్థత వల్లే సంక్షేమం, అభివృద్ధి ఆగడం లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం అన్నదాత సుఖీభవ కార్యక్ర మంలో భాగంగా రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో రైతులకు జెంబో చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం సృష్టించిందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక వ్యవస్థలను చక్కదిద్దుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఏపీకి తీసుకువచ్చి పిల్లల భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీవో రమణమ్మ, ఆత్మ పీడీ శారద, డీపీడీ మురళి, ఏడీఏ శ్రీదేవి, ఏవో నాగమోహన్, వేదగిరి క్షేత్రం ఛైర్మన్ అచ్యుతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు జెంబో చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

'టీబీ ముక్త్ భారత్' విజయవంతం చేయాలి : ఏడీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పిలుపునిచ్చారు. బుధవారం నారాయణ వైద్య కళాశాలలో క్షయ నివారణపై కోర్‌కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బాధ్యతగా క్షయ నివారణకు కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ క్షయ నివారణ లక్ష్యాలు పూర్తి చేసేలా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ ప్రసన్న పూర్ణ, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగుగంగ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో తీగలకు మరమ్మతులు చేస్తున్నందున గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరాగాం. దీ నగర్, సంజయ్ గాంధీనగర్, హౌసింగ్ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, దీనిని ఆయా ప్రాంతాల వినియోగదారులు గుర్తించాలని ఆయన కోరారు.

సీవోపీడీతో జాగ్రత్త!



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య నిపుణులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలి టీ ఆసుపత్రిలో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరి డీసీజ్(సీవోపీడీ)పై బుధవారం అవగాహన కార్యక్ర మం జరిగింది. నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, అడిషనల్ మెడి కల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ ధూమపానం, పరిశ్రమల కాలుష్యం కార ణంగా సీవోపీడీ బారినపడతారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ వ్యాధిగ్రస్తులకు నారాయణ ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స లు అందిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని చెప్పా రు. శ్వాసకోశ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నపూర్ణ మాట్లాడు తూ సీవోపీడీపై అవగాహన పెంచు కుని తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. దీనికి సంబంధి చిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కల్యాణి, జ్యోతి, రాజేష్ రెడ్డి, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరును అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో ఆత్మకూరును అగ్రగామిగా నిలపడమే లక్ష్యం అని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నా రు. బుధవారం ఉదయం ఆయన ఆత్మకూరు పట్టణంలో పర్యటించారు. అధునాతన హంగులతో నిర్మి స్తున్న మినీ బైపాస్‌రోడ్డు పనులను పరిశీలించారు. స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణాన్ని శాప్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సమస్యలపై విజ్ఞప్తులను స్వీకరించారు.

కమిషనర్‌తో కార్పొరేటర్ల భేటీ

నెల్లూరు(సిటీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కార్పొరేటర్లు కొందరు నగర కమిషనర్ నందన్‌తో బుధవారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. స్థానికంగా పారిశుధ్య సమస్యలు, కుక్కల బెడద, వీధిదీపాల తదితర అంశాలపై చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలపైనా మాట్లాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన శానిటేషన్ సెక్రటరీ మొహిద్‌అలీ కుటుంబానికి తోటి ఉద్యోగులు అందించిన రూ. 85,500 నగదును ఫిక్స్ డిపాజిట్‌గా వేసి ఆ పత్రాలను అలీ కుటుంబానికి అందచేశారు. అనంతరం పారిశుధ్య విభాగంతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

సతీష్ మరణంపై సీబీఐ దర్యాప్తు జరపాలి

- కమ్మరి, శాలివాహన సంఘం ధర్నా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : టీటీడీ పరకామణి కేసులో అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మరణంపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా శాఖ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సం ఘం జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌ది అను మానాస్పద మరణమన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వం తరఫున ఎవరూ పరామ ర్శించక పోవటం విచారకరమన్నారు. ఈ కార్యక్ర మంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరపు లలితారామ్ యాదవ్, శ్రీకుమార్ ఎస్ఎస్ యాదవ్, బుధవారపు బాలాజీ, సోమగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు రేపు కంటి వైద్య శిబిరం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం శుక్రవారం టౌన్‌హాల్‌లో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి నళినీ మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్మార్ట్‌విజన్ వైద్యశాల డాక్టర్ బీరం రాజేందర్‌రెడ్డి కంటి పరీక్షలు నిర్వహించి అవసర మైన వారికి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. దీనిని విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం నిషిద్ధం : ఎంహెచ్‌వో



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంహెచ్‌వో కనకాద్రి ఇతర అధికారులు

నెల్లూరు(సిటీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యాన్ని క్షీణింపచేసే పొగాకు ఉత్పత్తుల వాడకం వద్దని ఎంహెచ్‌వో డాక్టర్ కనకాద్రి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో విడుదల చేశారు. 2003లో తీసుకువచ్చిన చట్టం ప్రకారం పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. 18 ఏళ్లలోపు వారికి ఇలాంటి ఉత్పత్తులు విక్రయించకూడద న్నారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో వీటి అమ్మకాలు పూర్తి నిలిపివేసినట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఆర్ఆర్ కళాశాలకు ప్రయోగ పరికరాల వితరణ



మాట్లాడుతున్న కరస్పాండెంట్ రామదండు

నెల్లూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలకు అవసరమైన ప్రయోగశాల పరికరాలను భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం వితరణ చేశారు. కళాశాల కరస్పాండెంట్ పల్నాటి రామదండు మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యార్థులకు అన్నీ వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జేపీ జైన్, వాత్సల్య కార్యదర్శి జీవీ సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీ రవికుమార్, ట్రస్ట్ సభ్యులు మిశ్రామల్ జైన్, చంపలాల్ జైన్, ప్రకాష్ జైన్, పరాస్మాల్ జైన్, జయభారత్ హాస్పిటల్ ఉపాధ్యక్షుడు బాలు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో షార్ట్ టర్మ్ కోర్సులు

నెల్లూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ యోజన ద్వారా నిరుద్యోగ యువతులకు షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఆపైన చదివిన యువతులకు మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్, సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా అనలిస్ట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులను ఉచితంగా నేర్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి నివాళి

భారతదేశ వీరవనిత, స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత అతిథిగా హాజరై ప్రసంగించారు. స్త్రీలకు లక్ష్మీబాయి ఆదర్శమన్నారు. నేటితరం విద్యార్థినులు ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ మహిళలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ సీఈవో డాక్టర్ మధుమతి, డీకే కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, అధ్యాపకులు డాక్టర్ కే శ్రావణ్‌కుమార్, రాంబాబు, మనోజ్ ప్రభాకర్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి అమావాస్య



మూలస్థానేశ్వరాలయంలో విశేష అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో కార్తీక అమావాస్య సందర్భంగా బుధవారం రాత్రి పోలి అమావాస్య పూజ లు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రా భిషేకాలు, విశేష పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో జనార్దన్‌రెడ్డి, మూలస్థానేశ్వరస్వామి ఆలయం మాజీ చైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి పాల్గొ న్నారు. కాగా, మూలస్థానేశ్వర ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకా లు, సాయంత్రం ప్రత్యేక దీపారాధన, పోలి అమావాస్య కార్యక్రమం, ప్రాకారోత్సవం జరిగాయి. ఈవో అర్చభూమి వెంకటశ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు.

- నేడు శివపార్వతుల కల్యాణం

కార్తీకమాసం ముగింపు సందర్భంగా నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మంది రంలో గురువారం శివపార్వతుల కల్యాణం, కార్తీక సమారా ధన జరుగుతాయని ఆ మందిరం మేనేజరు సమయానంద ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా తరలిరావాలని ఆయన కోరారు.



రాజరాజేశ్వరి ఆలయంలో పోలి అమావాస్య పూజల్లో భక్తులు

'వెలుగొండ'లో కూంబింగ్



నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రాపూరు అటవీ శాఖ అధికారులు డిప్యూటీ రేంజర్ మురళి ఆధ్వర్యంలో బుధవారం కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాపూరు నుంచి కోటూరుపల్లి, తెగచర్ల వరకు అడవిని జల్లెడ పట్టినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఎర్రచందనం మొక్కలను కాపాడుకునేందుకు అణువణువునా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎర్రచందనం నరకడం చట్ట రీత్యానేరమని, అటవీ ప్రాంతంలో అనుమానితులు ఎవరన్నా తారసపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కూంబింగ్‌లో బీట్ ఆఫీసర్లు ఫరీద్ (గోనుపల్లి), ఎం.ప్రవీణ్ (తెగచర్ల), బేస్ క్యాంపు, స్ట్రైక్‌కింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)

నాట్లు వేసి.. ఉత్సాహం నింపి!



బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాట్లు వేసి అందరిలో ఉత్సాహం నింపారు. బుధవారం రేబాలలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే కొడవలూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మహిళా రైతు లలితమ్మ పొలంలో ఎమ్మెల్యేతోపాటు బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కోవూరు ఏడీ అనిత కూలీలతో కలిసి వరినాట్లు వేశారు.

- బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి)

గురుకులాల్లో పార్ట్ టైం లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైం లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ సీ ప్రభావతమ్మ ఓ ప్రకటనలో కోరారు. కందలేరు గురుకులంలో సివిక్స్, ఇంగ్లీష్, పీజీటీ మ్యాథ్స్, ఆదూరుపల్లి గురుకులంలో సోషల్ పీజీటీ పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండి, పీజీకి సంబంధించిన సబ్జెక్టుపై బీఈడీ అర్హత, టెట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆంగ్లభాషలో బోధన చేయాలని, ఆసక్తి గల వారు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు నెల్లూరులోని తమ కార్యాలయంలో డెమోకు హాజరు కావాలని తెలిపారు. .

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ,

పునరావాసం కల్పిస్తేనే భూములిస్తాం!

● తేల్చి చెప్పిన చెన్నాయపాలెం రైతులు ● ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్లు

కావలి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు అన్ని వసతులు ఉన్న చోట పునరావాసం కల్పిస్తేనే భూములు ఇస్తామని చెన్నాయపాలెం రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న బీపీసీఎల్ కంపెనీకి అవసరమైన భూసేకరణలో భాగంగా బుధవారం కావలి రూరల్ మండలం చెన్నాయపాలెంలో భూసేకరణపై జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మారిటైం బోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి తహసీల్దారు పీ. శ్రావణ్‌కుమార్‌లు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూములకు మొక్కుబడిగా ప్యాకేజీ ఇచ్చి భూములు లాగేసుకుంటే తామెలా బతకాలని ప్రశ్నించారు. భూములు లాక్కొని గ్రామం చుట్టూ ప్రహరీ కడితే గొర్రెలు, బర్రెలపై ఆధారపడి జీవించే వారు ఎలా బతకాలని నిలదీశారు. అలాగే బీపీసీఎల్ పరిశ్రమ వల్ల సముద్రంలో నీరు కలుషితమై మత్స్య సంపద కూడా పూర్తిగా తగ్గిపోతుందని, మత్స్యకారులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి అన్ని వసతులు ఉన్న చోట పునరావాసం కల్పించడమేగాక ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ జరిగితే దినసరి కూలీలు, పశుసంపదను నమ్ముకుని జీవించేవారు రోడ్డున పడతారని అన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రూ.20 లక్షల ప్యాకేజీకి ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి ధర నిర్ణయించాలని అన్నారు. అనంతరం జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రెండు దఫాలుగా భూసేకరణపై చర్చించినట్లు తెలిపారు. మారిటైం బోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమల ఏర్పాటుకు చేవూరు, రావూరు, చెన్నాయపాలెం, ఆనెమడుగులో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం పెంచేలా కృషి చేస్తామన్నారు.

కు.ని.కి కొత్త మందు

● అందుబాటులోకి ఇంజక్షన్ ● మహిళలకు మాత్రమే ఉపయోగం

● బయట మార్కెట్‌లో డోసు రూ.5 వేలు ● ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితం

● ప్రచారం లేక ఈ విధానం అమలులో జాప్యం



నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ (కు.ని)కు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. అయితే ఆయా పద్ధతుల్లో కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయాన్ని గు ర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిశోధనలు జరి పి, ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ఆడవారికి మాత్రమే ఉపయోగపడుతుంది. మగవారికి ఇంజక్షన్ ఇంకా ప్ర యోగదశలోనే ఉంది.ఈ నేపథ్యంలో తా జాగా కేంద్రం మిడ్రాక్స్ ప్రొజిస్టరాన్ అంత్రా ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిం ది. ఈ ఇంజక్షన్ ధర మార్కెట్‌లోకి ఒక్కో డోసు రూ. 5వేలుగా ఉంది. మహిళలకు దీన్ని ఉచితంగా వేయాలని కేంద్రం నిర్ణయించింది.

● ఏటా 17 వేల కు.ని ఆపరేషన్లు

జిల్లాలో ఏటా 40 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. అలాగే జిల్లాలో ఏటా 17 వేల కు.ని. ఆపరేషన్లు జరగాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకోసం కు.ని ఆపరేషన్‌తోపాటు బిడ్డకు బిడ్డకు వ్యవధి రెండేళ్లు ఉండేలా ఈ ఇంజక్షన్ ఎంతో ప్రయోజనకారిగా ఉంది. దీనివల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ ఉండవని వైద్యులు భరోసా ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రులకు ఈ ఇంజక్షన్‌లు వచ్చినా, వైద్యాధికారులు మాత్రం దీనిపై తగిన ప్రచారం చేయడంలేదు.దీంతో అనేక కుటుంబాలు ఈ ఇంజక్షన్‌కు దూరంగా ఉన్నాయి.

● ఎలా వేసుకోవాలి.. ఎవరిని సంప్రదించాలి ?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మిడ్రాక్స్ ప్రొజిస్టరాన్ అంత్రా ఇంజక్షన్ కోసం ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ఇప్పటివరకు ఎంత మంది పిల్లలు ఉన్నారనే వి వరాలు తెలియచేయాలి. అలాగే ఇం టి చిరునామాతోపా టు ఫోన్‌నంబరు ఇవ్వాలి. వైద్య సి బ్బంది అన్నీ వివరా లు నమోదు చేసుకున్న తర్వాత ఈ ఇంజక్షన్ వేస్తారు. కాన్పు అయినా ఆరువారాల తర్వాత మొదటి డోసు వేస్తారు. లేదంటే బహిష్టు తరువాత ఐదోరోజున ఈ ఇంజక్షన్‌ను వేస్తారు. బిడ్డబిడ్డకు ఎక్కువ వ్యవధి కావాల్సిన వారు దీన్ని వినియోగించుకోవచ్చు. ఇది నాలుగు నెలలవరకు పనిచేస్తుంది. ఆ తర్వాత మరో ఇంజక్షన్, ఇలా ఏడాదికి మూడు ఇంజక్షన్‌లు వేసుకుంటే ఏడాదిపాటు పిల్లలు పుట్టకుండా రక్షణ పొందవచ్చు. కు.ని. పద్ధతుల్లో ఇది మంచి ఫలితాలను ఇస్తున్న ది. నెల్లూరు. జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో ఈ ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచారు. అయితే 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీల్లో మాత్రం ఈ ఇంజక్షన్ అందుబాటులో లేదు. ఆత్మకూ రు జిల్లా ఆసుపత్రితోపాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులలోనూ అందుబాటులో ఉంచారు.

● ప్రైవేటుగా రేటు ఎక్కువే...

ప్రైవేట్ పరంగా ఔషధ దుకాణాల్లోనూ ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. అయితే ఇంజక్షన్ డోసుకు రూ. 5వేలు ఖర్చవుతుంది. మూడు నెలలు 3 డోసులకు రూ. 15వేలు ఖర్చు అవుతుంది. ఇంతఖర్చు పెట్టి పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఈ ఇంజక్షన్‌ను పీహెచ్‌సీలతోపాటు సీహెచ్‌సీల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలి. అలాగే వైద్యులు కూడా విస్తృత ప్రచారం కల్పించాలి.

అందుబాటులో ఇంజక్షన్



జిల్లావ్యాప్తంగా కు.ని.కి మి డ్రాక్స్ ప్రొజిస్టరాన్ అంత్రా ఇం జక్షన్‌లు అందుబాటులోకి వ చ్చాయి. కు.ని.కి ఈ ఇంజక్షన్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ఏడాదికి 4 నెలల పరిమితిలో ఈ ఇంజక్షన్ వేసుకోవచ్చు. కేవలం ఆడవారికి మా త్రమే ఇది పనిచేస్తుంది. అదే ప్రైవేట్ ఆసుపత్రుల్లో అయితే డోసుకు రూ. 5వేల ఖర్చు చే యాల్సి ఉంది. ప్రభుత్వం దీన్ని ఉచితంగా అందిస్తుంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా ప్రచారం అవసరం ఎంతో అవసరం.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, కుటుంబ నియంత్రణ అధికారి

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



నెల్లూరులోని ఓ లాడ్జీలో తనిఖీ చేస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ సోమయ్య

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ, నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో 1536 వాహనాలను తనిఖీ చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 36 మందిపై కేసులు నమోదు చేశారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు సంబంధించి 187 కేసులు నమోదు చేసి, రూ.1,39,685 అపరాధ రుసుము విధించారు. 15 వాహనాలు సీజ్ చేశారు. జిల్లాలోని 87 లాడ్జీలను తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపాన 167-బీజీ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటచేసుకొంది. వివరాల మేరకు.. ఉదయగిరి పట్టణానికి చెందిన మైదుకూరు శ్రీనివాసులు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కృష్ణంపల్లి గ్రామానికి వెళ్లాడు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సర్వరాబాదు గ్రామ సమీపాన రహదారిపై ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దానిని ఢీకొట్టి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

కలవాలి చేతులు..ఫలించాలి ఆశలు

● నిరుపయోగంగా ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు ● మెగా ఇండస్ట్రియల్ పార్కుకు అవకాశం

● ఎట్టకేలకు తొలగిన కోర్టు సమస్యలు ● ఉపాధి కోసం రైతుల ఎదురుచూపు



నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు- దగదర్తి మండలాల మధ్య రేగడిచెలక, రాచర్లపాడు గ్రామాల్లో 90వ దశకంలో ఇఫ్కో కిసాన్ సెజ్‌కు భూములు సేకరించారు. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు కోసం సుమారు 2700 ఎకరాలు అప్పగించారు. డెల్టా ప్రాంతంలో పుష్కలంగా పంటలు పండే భూములను రైతులు త్యాగం చేశారు. పరిశ్రమలు ఏర్పడితే తమ బిడ్డల భవిష్యత్తు బాగుపడుతుందని రైతులు ఆశపడ్డారు. అయితే అనుకున్న విధంగా కిసాన్ సెజ్ భూముల్లో పారిశ్రామికీకరణ జరగలేదు. తమకు పరిహారం చెల్లించకుండా భూములు తీసుకున్నారని కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో చాలా కాలంపాటు ఈ భూములు బీడుగా మారిపోయాయి. అయితే కొన్ని నెలల క్రితం ఈ కేసులన్నీ క్లియర్ అయ్యాయి. కిసాన్ సెజ్ భూములను పరిశ్రమలకు కేటాయించడంలో ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. అయినా ఇంకా ఆ భూముల్లో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే ప్రక్రియ అలస్యమవుతూ వస్తోంది.

● కీలక ప్రాంతం

కిసాన్ సెజ్ భూముల్లో మొదటగా ఏర్పాటైన పరిశ్రమ గమేశా. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 150 ఎకరాల్లో ఈ పరిశ్రమను ప్రారంభించారు. ఆ తర్వాత ఎటువంటి పురోగతి కనిపించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపించారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల స్థాపనకు కిసాన్ సెజ్ భూములు చాలా అనుకూలమని పరిశ్రమల వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. అదే సమయంలో ఇఫ్కో కిసాన్ సెజ్ యాజమాన్యం కూడా మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీలైనంత త్వరగా ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కావాలని రైతులు కోరారు.

వంకి పెంచలయ్యకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డుతో డాక్టర్ వంకి పెంచలయ్య

గూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకోవడంతో బుధవారం ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. జైపూర్‌లో జరిగిన ఇంటర్‌నేషనల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ 2025లో డాక్టర్ వంకి పెంచలయ్య విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి గ్లోబల్ లీడర్ షిప్ ఫోరం అనే సంస్థ పవర్ టూ ఎంపవర్ లీడర్ అవార్డును ప్రదానం చేసింది. విద్యారంగంలో రూపాంతరాత్మక ఆలోచనలు, ఉన్నత ప్రమాణాల నాయకత్వం, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు, సమాజ అభివృద్ధి పట్ల డాక్టర్ పెంచలయ్య చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందుకున్నారు. దీంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాద బీమా నగదు పంపిణీ



సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వం కలిగి మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రమాదబీమా నగదు మంజూరైంది. గుండుపల్లి గ్రామానికి చెందిన నల్లమేకల వెంగయ్య మృతి చెందగా ఆయన భార్య నల్లమేకల రమణమ్మకు రూ.5లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును బుధవారం మండల టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుమన్‌బాబు, మాజీ కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మండల యూత్ అధ్యక్షుడు వీకాష్‌బాబు, మండల ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో స్పౌజ్ ఉద్యోగులకు అంతర్ జిల్లాల బదిలీల అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. జిల్లాలో రూరల్‌కు సంబంధించి 534, పట్టణ నగర ప్రాంతాలకు సంబంధించి 226 సచివాలయాలు ఉన్నాయి. మొత్తంగా 760 సచివాలయాలు ఉండగా, వీటికి సంబంధించి 6840మంది విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో ఇటీవల జిల్లాలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరిగినా, ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలు ఒక జిల్లాలో ఒకరు, మరో జిల్లాలో ఒకరు ఉంటున్నారు. ఈ ఇబ్బందిని ఉద్యోగసంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో అంతర్ జిల్లాల స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించింది. సచివాలయాల్లోనే ఉద్యోగులు భార్యాభర్తలుగా ఉండడం, చెరొక జిల్లాలో ఉండడం, ఒకరు సచివాలయ ఉద్యోగి, మరొకరు అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారందరికీ ఒకే జిల్లాకు ఇద్దరు మారేలా బదిలీ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనికి సంబంధించి ఈనెల 30వరకు స్పౌజ్ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే జిల్లాలవారీగా ఎక్కడెక్కడ ఏయే పోస్టులు ఖాళీలు ఉన్నాయో, అధికారులు గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. ఖాళీల ప్రకారం ర్యాంకులు, సీనియారిటీలను బట్టి ఆయా ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు.

230 మందికి కంటి వైద్య పరీక్షలు



వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీపీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరంలో భాగంగా మండలంలోని కాంచెరువు, గువ్వాడి గ్రామాల్లో బుధవారం 230 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాంచెరువు గ్రామ టీడీపీ నాయకుడు పులివర్తి ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో మహిళలు, వృద్ధులు అధికసంఖ్యలో పాల్గొని వైద్యసేవలను పొందారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలపై ప్రాణాలాట !

రైలు పట్టాలపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి... ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా... ప్రమాదమని తెలిసి కూడా చాలా మంది రైల్వే ట్రాక్ దాటుతూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. దగ్గర దారి అని, త్వరగా వెళ్ళొచ్చని... ఇలా రకరకాల కారణాలతో రైలు వచ్చేస్తుండగా క్షణం ముందు కూడా పట్టాలు దాటే సాహసం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం నెల్లూరులో పట్టాలపై వెళుతున్న వ్యక్తి రైలు ఢీకొనడంతో పెన్నా నదిలో పడి మరణించాడు. రెండు రోజుల క్రితం కావలిలో విద్యార్థిని పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందింది. సో.... పట్టాలపై ప్రాణాలాటలు వద్దు సుమీ !

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, నెల్లూరు



ప్లాట్‌ఫాంపై బండి... పట్టాల మీదికెళితే ఎలాగండి!

నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్‌లో రైలు ఉండగానే పట్టాలు దాటుతున్న యువకులు



రైలొచ్చేలోపు దాటేద్దాం... పద !



కాలేజీకి షార్ట్‌కట్ అయినా.. ఈ రూటు కరెక్ట్ కాదు ఫ్రెండ్స్...!



ఫ్యామిలీతో తాపీగా.. ఇది రోడ్డు కాదు బ్రదర్...

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోజ్‌దార్‌వీధికి చెందిన గుండ్లపల్లి వాసంతి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు వెంకటేష్, పద్మావతిలు బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈనెల 13వతేదీ నుంచి వాసంతి కనిపించడంలేదని, బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11835
వెండి కిలో ధర	రూ. 160800
వెండి ఒక గ్రాము	రూ. 165.80

న్యూస్ బాక్స్

ఘనంగా వన మహోత్సవం


పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య ఆధ్వర్యంలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ


మద్యం సీసాలను పరిశీలిస్తున్న నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై

సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను బుధవారం నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై కాలేషావలి తనిఖీ చేశారు. స్టాకు నిల్వ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరకే విక్రయాలు జరపాలని, బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలు పటిష్టంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శారా స్రవంతి

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సంఘాలు పటిష్టంగా పనిచేయాలని ఏపీఎం శారా స్రవంతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని సంఘాల ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి సంఘానికి అన్నిరకాల రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆర్థిక సుస్థిరత, జీవనోపాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

వింజమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడం పేద విద్యార్థులకు వైద్య విద్యను అందకుండా చేయడం లాంటిదని వైసీపీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు పేర్కొన్నారు. బుధవారం వింజమూరు బంగ్లా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గ వైసీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఒంగోలు రాఘవేంద్ర, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఇర్మియా, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బేబీ సురేష్, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రేవనూరి శ్రీనివాస్‌రెడ్డి, వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిణి బదిలీ

సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న స్వప్నరెడ్డి మహిమలూరు పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఈమేరకు ఆమె బుధవారం రిలీవ్ అయ్యారు. ఈమె స్థానంలో అనంతసాగరం మండలం బొమ్మవరం పీహెచ్‌సీ నుంచి అశోక్, నాగేంద్ర అనే ఇరువురిని విడతల వారీగా విధులు నిర్వహించేలా నియమించారు.

ఆత్మకూరును అన్నీ రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో ఆత్మకూరును అగ్రగామిగా నిలపడమే లక్ష్యం అని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఆయన ఆత్మకూరు పట్టణంలో పర్యటించారు. అధునాతన హంగులతో నిర్మిస్తున్న మినీ బైపాస్‌రోడ్డు పనులను పరిశీలించారు. స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణాన్ని శాప్ అధికారులతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ డ్రింకింగ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సమస్యలపై విజ్ఞప్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలన కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నామన్నారు. 12 ఏళ్లుగా పూర్తి కాని స్పోర్ట్స్ స్టేడియం పనులు త్వరలోనే ప్రారంభమవుతా యన్నారు. మినీ బైపాస్‌రోడ్డు పనులు త్వరితగతిన పూర్తవుతాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున నిధులను సమీకరించి గత పదేళ్లుగా పడకేసిన అభివృద్ధి పనులను పట్టాలెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో బి పావని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మినీ బైపాస్‌రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

● గిరిజన సంఘాల ధర్నా


ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో బుధవారం తెల్లవారుజామున విద్యార్థిని మృతిచెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక జిల్లా వైద్యశాల ఎదుట గిరిజన సంఘాల నాయకులు ధర్నా చేశారు. విద్యార్థిని మృతదేహాన్ని పోలీసులు పంచనామా నిమిత్తం వైద్యశాలకు తీసుకురాగా, తల్లి దండ్రులను పరామర్శించేందుకు వచ్చిన గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ లోతైన విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని సర్దిచెప్పి ఆందోళన విరమింప జేశారు.

పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

● ఆర్‌ఐవో వరప్రసాదు


అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్‌ఐవో వరప్రసాదు

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు కృషిచేయాలని ఆర్ఐవో వరప్రసాదు సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ప్లస్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యాబోధనా తీరును పరిశీలించి ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులతో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రాక్టికల్స్ పరీక్షల సెంటర్‌ను ఏర్పాటుచేయలేక పోతున్నామన్నారు. దీంతో గత ఏడాది మాదిరిగానే ప్లస్‌లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్థానిక గురుకుల కళాశాలలో ప్రాక్టికల్స్‌తోపాటు పబ్లిక్ పరీక్షలకు సెంటర్ కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, నేతాజీ కాలేజీ కరస్పాండెంట్ మదార్‌బాష, అధ్యాపకులు ఉన్నారు.

సకాలంలో రేషన్ సరుకులు అందించాలి

వింజమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేషన్ దుకాణదారులు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో రేషన్ సరుకులు అందించాలని మండల టీడీపీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో మండలంలోని రేషన్‌షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటింటికీ రేషన్ సరుకులు అందడం లేదని డీలర్లను నిలదీశారు. అదేవిధంగా రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ నల్లగొండ్ల సుజన, డిప్యూటీ తహసీల్దారు ఓబయ్య, సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసులు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అల్లాబక్షు, టీడీపీ మండల కోక్లస్టర్ ప్రతినిధులు చేబ్రోలు వసంతరావు, మంచాల శ్రీనివాసులునాయుడు, సీనియర్ టీడీపీ నేతలు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి తరుణవాయి విద్యార్థిని ఎంపిక


మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థిని పాలా పల్లవి

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదివే పాలా పల్లవి మాక్ అసెంబ్లీకి ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పల్లవి ప్రతిభ కనబరిచింది. దీంతో ఆత్మకూరు నియోజకవర్గం తరఫున ఈనెల 26వ తేదీన అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి వెళ్లనుంది. మాక్ అసెంబ్లీలో ఆత్మకూరు నియోజకవర్గంలోని సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న పథకాలతోపాటు, విద్య, వైద్య రంగాలపై ప్రస్తావించనున్నట్లు పల్లవి తెలిపింది. పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కురుగొండ్ల


రైతులకు చెక్కును అందిస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గం పరిధిలో బుధవారం కలువాయిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో 30,990 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి ఒకొక్కరికి రూ.7వేలు వంతున రూ.20.60కోట్లు కూటమి ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు. ముందుగా కలువాయిలో ట్రాక్టర్లు, మోటారుసైకిళ్లతో నిర్వహించిన రైతుల ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం 80శాతం సబ్సిడీపై వ్యవసాయశాఖ తోపుగుంట అగ్రహారానికి చెందిన సత్యమ్మతల్లి రైతుమిత్ర గ్రూపునకు కిసాన్ డ్రోన్స్ ఆయన పంపిణీ చేశారు. డ్రోన్ పనితీరును వ్యవసాయ శాఖ పొదలకూరు ఏడీ శివనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ వెంకటగిరి ఏడీ అనసూయ, కలువాయి ఏవో కళారాణి, కూటమి పార్టీల మండల అధ్యక్షులు చల్లా రఘురామిరెడ్డి, మల్లిఖార్జున నాయుడు, పెరంకొండ మనోహర్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలి : ఏపీడీ


మాట్లాడుతున్న ఏపీడీ మృధుల

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గోకులం షెడ్లు మంజూరైన రైతులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృధుల సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బీ శ్రీనివాసులతో కలిసి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగుచేసిన రైతుల పొలాల్లో ఫారంపాండ్‌ల తవ్వకానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం కంపోస్టు గుంతను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ఉపాధి హామీ కూలీలకు సంబంధించి 72.44 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయిందని, నూరుశాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఆజాంఖాన్, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి తోడ్పాడాలి : ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల సమగ్రాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎంపీడీవో బీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ విశ్రాంత భవనంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుతోపాటు తాగునీటి పథకా లకు సంబంధించిన వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గ్రామసభ ద్వారా ఎంపిక చేయాలన్నారు. అందరి సహకారంతో గ్రామ పంచాయతీలను చెత్త రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి పంచాయతీ ఈవో కరీముల్లా, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు :** మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై ఎంపీడీవో చెంచమ్మ ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, పబ్లిక్ పరీక్షలకు అధ్యాపకులు ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా ఇంటర్ వృత్తివిద్యా శాఖాధికారి జీవీ కృష్ణారెడ్డి, జిల్లా అకాడమిక్ గైడెన్స్ మానటరింగ్ ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను వారు సందర్శించారు. ఈసందర్భంగా కళాశాలలో జరుగుతున్న అర్ధ సంవత్సర పరీక్షలను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేసి విద్యార్థులకు భోజనం వడ్డించారు. తరగతి, ల్యాబ్ గదులతోపాటు కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అల్కలైన్ వాటర్ సదుపాయాన్ని, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం

● బెంబేలెత్తుతున్న గ్రామస్థులు ● పట్టించుకోని అధికారులు


పెట్రోలు బంకు వద్ద గుంపుగా ఉన్న కుక్కలు

ఉదయగిరి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కుక్కల స్వైర విహారంతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. గండిపాళెంలో నివాసాల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. బస్టాండ్ సెంటరుతోసహా ప్రధాన రహదారులు, వీధులు, వైద్యశాల, పెంట్రోలు బంకు, పాఠశాలల ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పరుగులు తీస్తున్నారు. పిల్లలు, వృద్ధులు వాటి తాకిడికి భయపడి వెనకడుగు వేస్తున్నారు. నెలల తరబడి ఇలాంటి తంతు కొనసాగుతున్నా, పట్టించుకొనే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కుక్కల దాడితో పలువురికి గాయాలయినా, వాటి నివారణకు చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడమే లేదు. సుప్రీంకోర్టు వాటి నియంత్రణకు ఆదేశాలు జారీ చేసినా, అధికారులు మాత్రం మనకెందుకులే అంటూ మౌనం వహిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే పెట్రోల్ బంకు, మద్యం దుకాణం, ఉన్నత, గురుకుల పాఠశాలలు, ఎస్సీ కాలనీ, ఇతర వ్యాపారాలు ఉండే ప్రధాన రహదారి వెంట దారి పొడవునా కుక్కలు తిష్ట వేసి ఉంటున్నాయి. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా, ఫలితం లేకుండా పోతుందని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

కృష్ణమందిరంలో విగ్రహం చోరీ

● గంటల వ్యవధిలో నిందితుడి పట్టివేత


నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణమందిరంలో పంచలోహ విగ్రహం చోరీ చేసిన గంటల వ్యవధిలో పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంతపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య విలేకర్లతో మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. నగరంలోని కామాటివీధిలో సంతాన బాలగోపాల కృష్ణమందిరం ఉంది. వాచ్‌మన్ అంకయ్య ఎప్పటిలానే బుధవారం ఉదయం ఆలయం గేట్లు తెరిచి పనులు చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని దుండగుడు ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలోని పంచలోహ కృష్ణుడి విగ్రహం, ఇత్తడి గంటలను దోచుకెళ్లాడు. అర్చన చేసేందుకు పూజారి రఘునందన్ గుడిచి వచ్చి గర్భగుడిలోకి వెళ్లిచూడగా స్వామి వారి ఉత్సవ విగ్రహం, ఇత్తడి గంటలు కనిపించలేదు. దీంతో విషయాన్ని ఆలయ చైర్మన్ భాస్కర్‌కు తెలియజేశారు. భాస్కర్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య సంఘటనా స్థలానికి చేరుకొని చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని సీసీఫుటేజ్‌ల ఆధారంగా నిందితుడు కొడవలూరు మండలం నార్తురాజుపాలేనికి చెందిన పాతనేరస్థుడు వెంకయ్యగా గుర్తించారు. గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా విగ్రహాన్ని కోటమిట్ట ప్రాంతానికి చెందిన షేక్ షఫీకి విక్రయించినట్లు పేర్కొన్నారు. దీంతో పోలీసులు షఫీని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వెంకయ్యపై చీరాల రైల్వే పోలీసుస్టేషన్‌లో, ఒంగోలు తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో చోరీ కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను గంటల వ్యవధిలో అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ సోమయ్య, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

మద్యం మత్తులో వాహనంతో యువకుడి హల్‌చల్

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ యువకుడు మద్యం సేవించి టాటా మ్యాజిక్ వాహనంతో హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా మద్యం సేవించి వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద గల మెకానిక్ షెడ్ దగ్గర నిలిపి ఉన్న టాటా మ్యాజిక్ వాహనాన్ని నడుపుతూ 167-బీజీ జాతీయ రహదారిపై సీతారామపురం మార్గం వైపు వెళ్లి ఆర్టీసీ డిపో మీదుగా తిరిగి పట్టణంలోకి ప్రవేశించాడు. శివాలయం వద్ద ఉన్న అయ్యప్పస్వాముల గ్రామోత్సవంపైకి వేగంగా వాహనంతో దూసుకెళ్లాడు. ఒక కారు, డీజే వాహనాన్ని ఢీకొట్టాడు. గ్రామోత్సవంలో ఉన్న అయ్యప్పస్వాములు ఆ సమయంలో పక్కకు వెళ్లి ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారాన్ని పోలీసులు అందజేయడంతో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మహబూబ్‌బాషా, వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతనిపె కేసు నమోదు చేశారు.

ఆ చదువుల తల్లికి ఏమైంది!?

- 'జవహర్ నవోదయ'లో విద్యార్థిని ఆత్మహత్య
- అనుమానిస్తున్న మృతురాలి తండ్రి
- పూర్తిస్థాయిలో విచారించాలని వేడుకోలు

మర్రిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కావలి మండలం అటవి రాజుపాలెం గ్రామానికి చెందిన రవికుమార్, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. రవికుమార్ కొండాపురం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద కుమార్తె ప్రణీత మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది.


జవహర్ నవోదయ విద్యాలయం ముందు తల్లిదండ్రులు

● ఏం జరిగిందో ఏమో..

చదువులో ప్రణీత బాగా రాణిస్తోందని సహచర విద్యార్థులు తెలిపారు. అయితే, ఏం జరిగిందో ఏమో బుధవారం తెల్లవారుజామున విద్యాలయ భవనంలోని మెట్ల గ్రిల్స్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం సిబ్బంది గమనించి విద్యార్థిని తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్ పార్వతి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే విద్యాలయానికి చేరుకున్న వారు తాడుకు వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దించారు. విగతజీవిగా పడిఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువుల గుండెలవిసేలా విలపించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు.

● నా బిడ్డ పిరికిది కాదు..

ఆత్మహత్య చేసుకునేంత పిరికిది తన బిడ్డ కాదని ప్రణీత తండ్రి రవికుమార్ కన్నీటి పర్యంతమయ్యాడు. మంగళవారం రాత్రి 10.20 గంటల ప్రాంతంలో నా బిడ్డ ఫోన్‌లో మాట్లాడింది. 'నాన్నా... రేపు నీ సబ్జెక్ట్ ఎగ్జామ్ రాస్తున్నానంటే ఆల్ ద బెస్ట్ అమ్మ. బాగా రాయ్.' అని చెప్పాను. ఆ తర్వాత ఏమైందో ఏమో తెల్లవారుజామున 4 గంటలకు స్కూల్ నుంచి ఫోన్ వచ్చింది. ఉరి వేసుకునేంత పిరికిదికాదు నా బిడ్డ. ఐఏఎస్ కావాలనే ధీమాతో చదువుతోంది. క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో ఆడి విజయాలు సాధించింది. పరీక్షల సమయంలో తోటి వారితో మనస్పర్థలు ఉన్నట్లు గతంలో చెప్పింది. ఏదిఏమైనా నా కుమార్తె మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలి.' అని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

● విద్యాలయంలోకి నో ఎంట్రీ


పోలీసులను నిలదీస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

విద్యార్థిని మృతితో విద్యాలయంలోకి ఎవరినీ అనుమతించకుండా ప్రధాన గేట్లు మూసివేశారు. దీంతో రహస్యంగా లోపల ఏం జరుగుతుంది. ఎందుకు అనుమతించలేదంటూ విద్యార్థి సంఘం నాయకుడు మహంత్ రెడ్డి తదితరులు ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు.

● నిర్వహణపై పర్యవేక్షణ కరువు?

నవోదయ విద్యాలయ నిర్వహణపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్లో ఫ్యాన్లు మరమ్మతులకు గురైతే పట్టించుకోరు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదంటూ పలుమార్లు విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడ్డారు. నిర్వహణపై ఎవరైనా ప్రశ్నిస్తే కక్షసాధింపులకు దిగుతున్నారని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో భోజనం సక్రమంగా లేకపోవడంతో ఆకలి తీర్చుకునేందుకు కొందరు విద్యార్థులు గోడలు దూకి కృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో ఫాస్ట్ ఫుడ్ షాపులకు వెళ్తున్నారు. ఇలా వెళ్లిన ఇద్దరు విద్యార్థులను ఇటీవల ఇళ్లకు పంపినట్లు సమాచారం. అంతేగాక విద్యాలయంలో బోధన సిబ్బంది దీర్ఘకాలంగా అక్కడే పనిచేస్తుండటంతో గ్రూపులు, వివాదాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రిన్సిపాల్ 6వ తరగతి విద్యార్థిని గోడకేసి కొట్టటంతో తీవ్ర గాయమైంది. తల్లిదండ్రుల ఆందోళనతో ఆమెను సస్పెండ్ చేశారు. ఈ ఘటన మరువక ముందే ప్రణీత మృతి విద్యార్థులలో కలవరం మొదలైంది. గతంలోనూ ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 650

పంచాయతీ కార్యదర్శికి మెమో

వలేటివారిపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన ఆ గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మినహా మిగిలిన సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావడంతో మెమో జారీ చేసినట్లు తెలిపారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్‌రావు →



ఉన్నది కూలదోశారు..!

- కొత్త షెడ్డు నిర్మాణం పిల్లర్లకే పరిమితం
- ముందుకు సాగని రైతుబజారు పనులు
- ఎండావానకు రైతులు, వ్యాపారుల అవస్థ



రైతుబజారులో వేసిన పిల్లర్ల వద్దనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కావలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారాయి కావలి రైతు బజారు నిర్మాణ పనులు. రైతుబజారు మధ్యలో ఉన్న పాతషెడ్డును తొలగించి ముందు, వెనుక కలిపి రైతు బజారు ఆవరణం మొత్తం నూతనంగా షెడ్డు నిర్మించేందుకు రెండు టెండర్లు పిలిచారు. ఒక టెండర్ పూర్తి అయ్యి వర్క్ ఆర్డర్ కూడా ఇవ్వడంతో పాత షెడ్డును దక్షిణం వైపు పడగొట్టి కొత్త షెడ్డు నిర్మాణానికి పిల్లర్లు వేశారు. దీంతో చకచక పనులు అయిపోతాయని భావించారు. అయితే మొదటి నుంచి నిర్మాణ పనులపై అంత ఆసక్తి చూపని కాంట్రాక్టర్ చివరకు ఎమ్మెల్యే ఒత్తిడితో పనులు ప్రారంభించినా ఆ తర్వాత పనులు ఆపేశారు. దీంతో ఉన్నది పోయి.. కొత్తది రాక.. వ్యాపారులు వానలో తడుస్తూ, ఎండలో ఎండుతూ వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. కావలి రైతు బజారుకు తొలివిడతగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల నుంచి రూ.45 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో ఈ ఏడాది జూలై 2వ తేదీన ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణలు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న రైతు బజారు పాత షెడ్లు స్థానంలో కొత్త నిర్మాణం చేపట్టేందుకు తొలుత నిధులు మంజూరు చేశారు. అయితే రైతు బజారు ముందు, వెనుక చాలా ఖాళీ స్థలం ఉండడంతో వర్షం వస్తే రైతు బజారులో వర్షం పడకుండా ముందు వెనుక కూడా కొత్త షెడ్లను నిర్మించే విధంగా మరో రూ.55 లక్షలు రైతు బజారు నిధుల నుంచి ప్రతి పాదనలు పంపారు. ఆ ప్రతిపాదనల మేరకు ఇంకా నిధులు మంజూరు కాక పోవడంతో శంకుస్థాపన శిలాఫలకం వేసి మూడున్నర నెలలు తర్వాత పనులు మొదలు పెట్టి పిల్లర్లు వేసి మళ్లీ నిలిపేశారు. రైతు బజారు ప్రస్తుతం వినియోగంలో ఉండడంతో వారిని అక్కడ నుంచి తాత్కాలికంగా దానికి ఎదురుగా ఉన్న మున్సిపల్ కూరగాయల మార్కెట్ స్థలంలోకి తరలించి అక్కడ నూతన నిర్మాణాలు చేపట్టాలని భావించారు. అయితే మున్సిపల్ కూరగాయల మార్కెట్ స్థలం కూడా కొందరికి మున్సిపల్ అధికారులు లీజ్‌కు ఇచ్చి ఉండడంతో అక్కడ ఉన్న వారిని తొలగించడం కుదరలేదు. దీంతో ఎట్టకేలకు రైతు బజారులో దక్షిణం వైపున ఉన్న దుకాణదారులను తొలగించి వారికి రైతుబజారులో ఖాళీగా ఉన్న ప్రాంతంలో స్థలం సర్దుబాటు చేసి దక్షిణం వైపున పిల్లర్లు వేయడానికి గుంటలు తీసి పిల్లర్లు నిలిపి కాంక్రీట్ పనులు చేపట్టారు, ఇది పూర్తి అయిన తర్వాత ఉత్తరం వైపున ఉన్న దుకాణాలను తొలగించి అక్కడ కూడా పిల్లర్లు వేసి మళ్లీ వారిని అక్కడే సర్దుబాటు చేసి పనులు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ లోపు కొత్తగా ప్రతిపాదనలు పంపిన రూ.55 లక్షల నిధులు మంజూరైతే రైతు బజారు, వెనుక, ముందు మొత్తం కలుపుతూ రైతు బజారు ప్రాంగణం అంతా వర్షం పడకుండా షెడ్ల నిర్మాణాలు చేపట్టేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇలా రైతు బజారులో ఉన్న వ్యాపారులను బయటకు పంపకుండానే దాని నిర్మాణం చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టారే కానీ నిర్మాణ పనులు ఆదిలోనే ఆపేయడంతో వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.



రైతుబజారు ముందు ఎండలో చిరు వ్యాపారులు

ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు

రైతు బజారు నిర్మాణంలో కొన్ని ఇబ్బందుల ఏర్పడిన కారణంగా పనులు ఆలస్యమైనట్లు కాంట్రాక్టర్ తెలిపారు. అయితే ఆలస్యానికి ఇప్పటికే కాంట్రాక్టర్‌కు మూడు నోటీస్‌లు ఇచ్చాం. కొంత మేరకు పెనాల్టీ కూడా విధించాం. ఇంకా పనులు చేపట్టడంలో ఆలస్యం చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

\- హరినారాయణరెడ్డి,
మార్కెటింగ్ కమిటీ డీఈ, నెల్లూరు

వరద కాలువ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



వరద కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డు పరిధిలో శివసాయి పబ్లిక్ స్కూల్ నుంచి వాసవీ నగర్ కల్వర్టు వరకు రూ.78.5 లక్షలతో నిర్మించ తలపెట్టిన వరద కాలువ పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఏడాదిన్నర కాలంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో రోడ్ల వెడల్పు కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్ సమస్య నివారణకు సహకరించాలని, ప్రధాన రోడ్ల వెంబడి ఖాళీగా ఉన్న స్థలాలలో తోపుడుబండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిన్న చిన్న వ్యాపారాలన్నీ ఒకేచోట ఉండేలా నెల్లూరులో ఏర్పాటు చేసిన స్మార్ట్‌బజార్ మోడల్‌ను తన సూచనతో మున్సిపల్ కమిషనర్ అనూష వెళ్లి పరిశీలించి వచ్చారని, అలాంటి స్మార్ట్ బ జార్‌ను త్వరలో కందుకూరులో ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. ఈ సందర్భంగా ఓవీ రోడ్డుకు దక్షిణం వైపు రూ.74 లక్షలతో నిర్మిస్తున్న వరదనీటి కాలువ పనులను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, డీఈఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, చిలకపాటి మధుబాబు, పోకూరి రాంబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● యూరియా కొరత రాకుండా పర్యవేక్షణ

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు యూరియా కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక సీటీఆర్ఐ కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాలొని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడతగా రాష్ట్రప్రభుత్వం రూ. 5వేలు కేంద్ర ప్రభుత్వం రూ2 వేలతో కలిపి రూ.7వేలు రైతుల ఖాతాలకు జమచేశారన్నారు. కందుకూరు నియోజకవర్గంలో 32వేల మంది రైతులకు రూ.21.46 కోట్ల జమ అయ్యాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను, ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ హెడ్ అనూరాధ, కేవీకే హెడ్ ప్రసాద్‌బాబు, ఇంచార్జి ఏడీఏ శేషారెడ్డి, ఏవో అబ్దుల్‌రహీం, హెచ్‌వో జ్యోతి, ఐదు మండలాల ఏవోలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బోగోలులో జాతీయ ఐక్యతా దినోత్సవం



మాట్లాడుతున్న సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు

బిట్రగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు పాల్గొని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికలు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని ధైర్యంగా విద్య, సామాజిక సేవల్లో ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధి శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ రావు, ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు


● ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కు అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య, టీడీపీ నేతలు

కావలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య కొనియాడారు. రైతుల సంతోషమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000లను బుధవారం రైతుల ఖాతాలలో జమ చేశారన్నారు. ఈ సందర్భంగా మద్దూరుపాడులోని కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం రైతులతో కార్యక్రమం నిర్వహించారు. కావలి నియోజకవర్గంలో 18,305 మంది రైతులకు రూ.11,93,27,000 మెగా చెక్కును రైతులకు అందజేశారు. పీఎం నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న సేవలు రాయితీల గురించి వివరించారు. కావలి వ్యసాయమార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందుతున్న సేవలను గురించి చైర్‌పర్సన్ అలేఖ్య వివరించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మరింత సేవలను అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు, వ్యవసాయమార్కెట్‌కమిటీ సెక్రటరీ రామాంజనేయులు, వైస్ చైర్మన్ చెంచంగారి శ్రీనివాసులు, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతిబాబూరావు, మాలేపాటి నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న హరికృష్ణ

అల్లూరు, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఇందుపూరు, పట్టణ పరిధిలోని రామాపురం గిరిజన కాలనీలలో నివాసం ఉంటున్న సుమారు 81 కుటుంబాలకు ఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ నిత్యావసరాలు, దుప్పట్లు సమకూర్చింది. వీటిని బుధవారం ఇందుపూరులో జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎందేటి హరికృష్ణ, రామాపురం గిరిజన కాలనీ జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజరు స్వప్న, స్థానిక నాయకుడు జగన్మోహన్‌రావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తోట శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన అన్నదాత-సుఖీభవ, పీఎం కిసాన్ లైవ్ కార్యక్రమాన్ని అధికారులు, రైతులతో కలసి మండలంలోని వెలగపాడు సచివాలయం వద్ద వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు యూరియా బస్తాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యానపంటలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని కోరారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి సహకారంతో సోమశిల హైకెనాల్, వెలుగొండ ప్రాజెక్టుల ద్వారా నియోజకవర్గంలో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చొరవతో పంచాయతీలకు విరివిగా నిధులు మంజూరవడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం రూ.1.75 కోట్లతో నిర్మించిన వెలగపాడు-కొత్తూరు రహదారి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, బీవీ రామారావు, దేవనబోయిన వెంకటసుబ్బయ్య, గన్నమనేని శ్రీనివాసులు, కర్నాటి ప్రభాకర్, గొల్లపూడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

● జోరుగా పొగనారుమడులు, జామాయిల్ సాగు



వెంగళాపురం గ్రేజింగ్ భూముల్లో సాగు చేసిన పొగాకు

లింగసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ భూముల్లో పైర్లు సాగు చేయవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆక్రమణదారులు వాటిని ఖాతరు చేయడం లేదు.గతంలో వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం, పెంట్రాల ఆర్‌ఆర్ పాలెం, మొగిలిచెర్ల గ్రామాల్లోని పంచాయతీ గ్రేజింగ్ భూములు, అస్సైన్‌మెంటు, ఇతర ప్రభుత్వ భూముల్లో పొగాకు, జామాయిలు ఇతర పైర్ల సాగు చేయగా, అధికారులు ఆ భూముల్లో మరోసారి పైర్లు సాగు చేయవద్దని దండోరా వేయించారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.అయినా భూ ఆక్రమణదారులు ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టి యథావిధిగా ఆ భూములలో పైర్లు సాగు చేస్తున్నారు. మండలంలోని వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం, పెంట్రాలలో పంచాయతీ గ్రేజింగ్ భూములలో, ఆర్‌ఆర్ పాలెంలో కండేవారి బీడు, అలాగే అస్సైన్‌మెంటు భూములలో, మొగిలిచెర్లలో అస్సైన్‌మెంటు భూములు, గ్రేజింగ్ భూములలో ప్రస్తుతం పొగనార్లు, పొగాకు, జామాయిల్ తదితర పైర్లు సాగు చేస్తున్నారు.మరికొందరు ఆయా గ్రామాలలో ఈ భూములను కౌలుకిస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సాగు నీటిని వృథా చేయొద్దు

● ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి

లింగసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో సంవృద్ధిగా చేరిన నీటిని పొదుపుగా సాగునీటి అవసరాలకు వినియోగించాలని ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ డీ.వరలక్ష్మి చెప్పారు. బుధవారం ఆమె రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులో నీటి మట్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టు కుడి ఎడమ కాలువ తూముల నుంచి కాలువలకు విడుదలవుతున్న నీటి వివరాలు, గేట్ల పరిస్థితి గురించి ప్రాజెక్టు డీఈని అడిగి తెలుసుకున్నారు. అలాగే పైర్లకు నీటి నిర్వహణను సక్రమంగా పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది టెక్నికల్ ఏఈలను ఈ ప్రాజెక్టు వద్దకు తీసుకొని వచ్చి ప్రాజెక్టులోని గేట్లు నిర్మాణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈలు ఎం.వెంకటేశ్వర్లు, పీ.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.68,350 స్వాధీనం

ఉలవపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరిధిలోని టెంకాయచెట్లపాలెంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో తన సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించనట్లు ఎస్ఐ అంకమ్మ చెప్పారు. గ్రామంలో ముగ్గురు వ్యక్తులు పేటకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.68,350 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీఆర్‌కోటలో వైద్య శిబిరం

లింగసముద్రం, నంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీఆర్‌కోటలో బుధవారం పంటవారిపాలెంకు చెందిన ఎల్‌వీ ప్రసాదు కంటి వైద్యశాల వైద్యులు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు బోయిళ్ల కొండపనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 9 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఏడుగురికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

13న జాతీయ లోక్‌అదాలత్

కందుకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ కోరారు. ఈ లోక్ అదాలత్‌లో రెవెన్యూ, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా ఆయా శాఖల అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, చెక్‌బౌన్స్, భరణం, గృహహింస, రాజీపడదగిన క్రిమినల్ కేసులు కూడా పరిష్కరిస్తామని, కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు అన్నదానం

కొండాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడులో ఉన్న కృష్ణ మందిరం 3వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. మందిరం నిర్మించిన గ్రామానికి చెందిన విడవలపాటి వెంకయ్య శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 96 ఏళ్ల వయస్సులోనూ శ్రీకృష్ణ భగవానుడికి సేవ చేసే అదృష్టం కలగడం అనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిట్రగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బోగోలులోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ జడరాయ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బోగోలు పట్టణ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దీంతో అరవపాలెం, విశ్వనాథరావు పేట, రామస్వామిపాలెంకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించి తమకు సహకరించాలని తెలిపారు.

అన్నదాతల జీవితాల్లో ఆనందమే ఎన్‌డీఏ లక్ష్యం

కావలి(టౌన్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాతల జీవితాల్లో ఆనందమే ఎన్‌డీఏ ప్రభుత్వాల లక్ష్యమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000, కేంద్ర ప్రభుత్వం రూ.2,000 కలిపి రైతు ఖాతాల్లో రూ.7,000లను ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేయడం రైతులకు మరో పండగ లాంటిదన్నారు. ఈ సమావేశంలో టెలికామ్ సలహా మండలి సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్, రాకేష్, పట్టణ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గణిత ఉపాధ్యాయుడు



గణిత ఉపాధ్యాయుడు కొండలరావు

ఉలవపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలలో జిల్లా తరుపున మండలంలోని రామాయపట్నం జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు కేదారి కొండలరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈనెల 12న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ యోగా చాంపియన్ షిప్-25 పోటీల్లో పాల్గొన్న ఆయన జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాఠశాల సహచర ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు



మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

లింగసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పలువురు సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో గళమెత్తారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అజెండాలోని అంశాలపై అధికారులు వివరించారు. ముక్తేశ్వరం గ్రామానికి రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం నీరు రావడం లేదని, ఇంకా మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురయ్యాయని సర్పంచు వంటేల శ్రీనివాసులు తెలిపారు. శింగరపాలెంలో మూడు నెలల నుంచి ఈ పథకం నీరు కాలనీకి రావడం లేదని ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు చెప్పారు. ఆర్‌ఆర్ పాలెంలో పశువుల తొట్టిపైనే మళ్లీ పశువుల తొట్టి నిర్మించారని సర్పంచు అంజమ్మ చెప్పారు. మాలకొండరాయునిపాలెంలో రీ సర్వే పూర్తయిందని, పాస్‌బుక్‌లు రాలేదని, దీంతో రుణాలు తీసుకోవడంలో ఇబ్బందులు వస్తున్నాయని శ్రీనివాసులు తహసీల్దార్ కోటేశ్వరరావు దృష్టికి తెచ్చారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో గ్రేజింగ్ భూముల వివరాలు అందజేయాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే.శ్రీనివాసులు, పీఆర్ ఏఈ సీహెచ్ రాజశేఖర్, ఏపీఓ సమీర్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మాల్యాద్రి

కావలి(టౌన్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండాలని జేబీ డిగ్రీ కళాశాల స్వయం ఉపాధి కోర్సుల సంచాలకుడు డాక్టర్ ఆర్ మాల్యాద్రి పేర్కొన్నారు. జేబీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం కావలి చెరువు కట్ట వద్ద గిరిజన కాలనీలో ఎన్ఎస్ఎస్ అధికారి అయూబ్ అహ్మద్ పర్యవేక్షణలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, క్యాంప్‌లు నిర్వహించే ప్రాంతాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, ప్రాథమిక ఆరోగ్యపు అలవాట్లపై అవగాహన కల్పించాలన్నారు. విశ్రాంత హిందీ అధ్యాపకుడు భాస్కర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అంకితభావంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, టీవీ రమణ, స్థానికులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్ల పట్టాలు దాచుకోవడం ఏమిటి?

వలేటివారిపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండసముద్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో 86 ఎస్సీ మాదిగ కుటుంబాలకు ఇచ్చిన పట్టాలను స్థానిక సర్పంచు దాచుకోవడం ఏమిటని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు ప్రశ్నించారు. మండలంలోని కొండసముద్రంలోని జగనన్న కాలనీని బుధవారం ఆయన లబ్ధిదారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఇళ్ల పట్టాలను ఇవ్వాలని లబ్ధిదారులు ఆయనను అడిగినప్పుడల్లా నాదగ్గర ఉన్నాయి, వాటితో మీకేమిపని అని సర్పంచు అంటున్నారని లబ్ధిదారులు చెబుతున్నట్లు సురేష్‌బాబు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే సీపీఐ పోరాటం సాగిస్తుందని ఆయన అధికారులను హెచ్చరించారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఒకేరోజు ఐదు చైన్ చోరీలకు పాల్పడిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన భావారియా గ్యాంగ్‌లోని కీలక వ్యక్తిని తిరుపతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు వివరాల మేరకు.. తిరుపతిలో అక్టోబరు 4న ఇద్దరు వ్యక్తులు మూతికి మాస్క్, తలకు టోపీ ధరించి పల్సర్ వాహనంలో తిరుగుతూ ఎస్టీవీనగర్, మంగళం, ఉపాధ్యాయనగర్ తదితర ప్రాంతాల్లో ఐదుగురు మహిళల మెడల నుంచి బంగారు చైన్లు లాక్కొని పరారైన విషయం విదితమే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుర్మక్ తన ఇద్దరు సహచరులు జయరాం, మోహన్‌తో కలసి ఈ చోరీలకు పాల్పడినట్లు గుర్తించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆటోనగర్‌లోని రైల్వేగేట్ సమీపంలో మంగళవారం గుర్మక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. అతని నుంచి బైక్, బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబును ఎస్పీ అభినందించారు.



మృగరాజుపై యోగనరసింహుడిగా..

● భక్తులను కటాక్షించిన పద్మావతి

తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరచానూరులోని పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం ముత్యపుపందిరిపై అమ్మవారు శ్రీధనలక్ష్మి రూపంలో భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, వేద, ప్రబంధ పారాయణం, భజన బృందాల ప్రదర్శనలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ తిరువీధుల్లో ముత్యపుపందిరి వాహనం ముందుకు సాగింది. మధ్యాహ్నం శ్రీకృష్ణ ముఖమండపంలో ఉత్సవమూర్తికి నేత్రానందంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి సింహవాహనంపై యోగనరసింహుడి రూపంలో అమ్మవారు తిరుమాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. కళాబృందాల సాంస్కృతిక నీరాజనంతో అమ్మవారి సింహవాహన సేవ అత్యంత రమణీయంగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ మూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



● బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం: కల్పవృక్ష వాహనం
మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ
రాత్రి: హనుమంత వాహనం



నేడు తిరుమలకు రాష్ట్రపతి రాక

● గవర్నర్ పర్యటన రద్దు ● స్వాగతం పలకనున్న మంత్రులు

తిరుమల, తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం తిరుమల రానున్నారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఆమెకు స్వాగతం పలికేందుకు గవర్నర్ రావాల్సి ఉన్నా.. చివర్లో ఆయన రద్దయింది. దీంతో హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు.. పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ అధికారులు స్వాగతం పలకనున్నారు. ఒడిశా నుంచి రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం 4గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. రోడ్డు మార్గాన 4.30గంటలకు తిరుచానూరుకు వచ్చి పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. 5.20 గంటలకు బయలుదేరి తిరుమలకు వెళ్లి పద్మావతి అతిథి గృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9.20గంటలకు వరాహస్వామిని. ఆ తర్వాత శ్రీవారి ఆలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకుంటారు. 11 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు బయలుదేరతారు.

భారీ భద్రత: విజయవాడలోని ఓ ఇంట్లో మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలతో రాష్ట్రపతి పర్యటనకు భారీ భద్రత ఏర్పాటు చేశారు. డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఐదుగురు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, 300 మంది పోలీసులు, రోడ్డు ఓపెనింగ్ పార్టీలు, రోప్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్‌లు, పారా మిలటరీ దళాలు, రిజర్వు బలగాలు, ఏరియా డామినేషన్ పార్టీలను బందోబస్తు నిమిత్తం నియమించారు. వీరు కాకుండా రాష్ట్రపతి వెంట కమెండో దళాలు ఉంటాయి. కేంద్ర బలగాలూ మోహరించనున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి తిరుమల వరకు పటిష్ఠ బందోబస్తుతో పాటు బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. బుధవారం కూడా కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ భద్రతా ఏర్పాట్లపై ఆలయం వద్ద చర్చించారు.



భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న అదనపు ఈవో, కలెక్టర్, భద్రతాధికారులు

రైతుల ఖాతాల్లో రూ.104.15 కోట్ల జమ

నాయుడుపేట/టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన కింద 1,54,908 రైతుల ఖాతాల్లో రూ.104.15 కోట్లు జమయ్యాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఈ నిధులను బుధవారం విడుదల చేయగా, ఆయా నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలతో పాటు అన్ని సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి నాయుడుపేటలో జరిగిన సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ పథకం, ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, ఏడీ ధనంజయరెడ్డి, ఏవోలు గణేష్, గాయత్రి, ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఆకుతోట రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మీపై మనీల్యాండరింగ్ కేసు

● సీబీఐ అంటూ సీనియర్ సిటిజన్‌కు వాట్సాప్ కాల్ ● డిజిటల్ అరెస్టు పేరిట రూ.80 లక్షల వసూలు ● తిరుపతిలో ఎనిమిది మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మేము ముంబై సీబీఐ అధికారులం. మీపై రూ.583 కోట్ల మనీల్యాండరింగ్ కేసులో మీ పేరుంది. వాట్సాప్ కాల్ ద్వారా మిమ్మల్ని విచారిస్తున్నాం' అంటూ డిజిటల్ అరెస్టు పేరిట భయపెట్టారు దీన్నుంచి బయట పడాలంటే రూ.80 లక్షలు పంపాలంటూ ఒత్తిడి చేశారు. ఇలా తిరుపతిలోని 65 ఏళ్ల సీనియర్ సిటిజన్ నుంచి వివిధ ఖాతాలకు నగదు వేయించుకున్న ఎనిమిది మంది సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరి జాయింట్ అకౌంటులోని దాదాపు రూ.2.5 లక్షలను ఫ్రీజ్ చేశారు. ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. డిజిటల్ అరెస్టుకు భయపడిన తిరుపతివాసి నుంచి రూ.80 లక్షలను వివిధ రాష్ట్రాల్లోని మ్యూల్ ఖాతాల్లోకి సైబర్ నేరగాళ్లు జమ చేసుకున్నారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో డీఎస్పీ భక్తవత్సలం స్వీయ పర్యవేక్షణలో ఎస్ఐలు, సిబ్బంది ప్రత్యేకంగా ఢిల్లీ వెళ్లి నిందితుల కోసం గాలించారు.

చివరికి డబ్బులు చేరింది ఎక్కడికంటే..

బాధితుడి అకౌంటు నుంచి రెండు మ్యూల్ అకౌంట్లకు నగదు జమ చేయించారు. ఆ మ్యూల్ ఖాతాల నుంచి 14 రాష్ట్రాల్లోని ఇతర అకౌంట్లకు ఆ మొత్తం చేరింది. చివరికి.. గేమింగ్ యాప్ వినియోగదారులకు ఆ మొత్తం చేరినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ప్రధాన నిందితుడు కోటి బాబుకు టెలిగ్రామ్ ద్వారా హరియాణాలోని డానియల్, చైనాకు చెందిన టియాన్, ఇంకా డీ పేర్లతో ఉన్న విదేశీ నెట్‌వర్కులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. గతేడాది జనవరిలో కోటి బాబు కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు సైబర్ నేరగాళ్లతో కలిసి పనిచేసి తిరిగి హైదరాబాదుకు వచ్చాడు. ఇక, క్రాంతి కుమార్, పవన్ కుమార్ కలిసి తప్పుడు పత్రాలతో డీకేకే ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ పేరిట జాయింట్ కరెంట్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆ ఖాతాలోకి రూ.30 లక్షలు జమకాగా.. ఆ తర్వాత విదేశీ సైబర్ నెట్‌వర్క్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు నిర్ధారించారు. మరికొన్ని కేసుల్లోనూ ఈ ఖాతాను వినియోగించినట్లు బయటపడింది. వాటిపైనా దర్యాప్తు కొనసాగుతోంది. అదనంగా, ఈ అకౌంట్ తెరవడంలో సంబంధిత బ్యాంక్ ఉద్యోగుల ప్రమేయం ఉందా అనేది దానిపైనా విచారిస్తున్నారు.

అరెస్టయింది 8 మంది వీరే

దండే క్రాంతికుమార్, నిమ్మల పవన్‌కుమార్ (అనంతపురం), మానే కోటిబాబు, గుండవేని గౌతమ్ (హైదరాబాదు), పరపాల శ్రీనివాస్ (రాజమండ్రి), ఎం.చంద్రశేఖర్, శివశంకర్, నగారిధన్ ప్రశాంత రెడ్డి (బళ్లారి)అరెస్టయిన వారిలో ఉన్నారు. ఇక, కీలక నిందితుడు హైదరాబాదులోని యూసఫ్‌గూడకు చెందిన మొహమూద్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

అలాంటి వారితో జాగ్రత్త

'నీ అకౌంట్ నుంచి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తే కమీషన్ ఇస్తాం. కేవైసీ పంపు. నెలవారీ ఆదాయం వస్తుంది. కరెంట్ అకౌంట్ ఓపెన్ చేస్తే జీతం వస్తుంది' అని ఎవరైనా చెప్పారంటే.. వాళ్లు సైబర్ నేరగాళ్లే. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలంటూ ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. డిజిటల్ అరెస్టుల పేరిట ఎవరైనా బెదిరిస్తే 112 లేదా సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబరు 1930 కు ఫోనుచేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు శ్రీనివాసులు, వినోద్‌కుమార్, ఎస్ఐలు హేమాద్రి, నాగార్జున రెడ్డి, లోకేష్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

స్వర్ణమ్మకు గంగా హారతి



గంగాదేవి ఉత్సవమూర్తికి పూజలు



స్వర్ణమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే



నదీ హారతులు ఇస్తున్న వేదపండితులు

కార్తీక మాసం.. అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్వర్ణముఖి నదికి గంగా హారతులిచ్చారు. తొలుత ముక్కంటి ఆలయం నుంచి గంగాదేవి ఉత్సవమూర్తిని స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. నదీ జలాలకు, ఉత్సవమూర్తికి పండితులు పూజలు చేశారు. గంగాదేవికి శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు స్వర్ణమ్మకు ద్వాదశ(12) హారతులు పట్టారు. ఆగమ నియమాల ప్రకారం వివిధ రకాల హారతులను వరుసగా గంగమ్మకు సమర్పించారు. పలువురు భక్తులు నదీ దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు స్వర్ణముఖి నది వద్ద విద్యుత్తు అలంకరణలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్, బొజ్జల బృందమ్మ, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు, ఈవో బాపిరెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న దాత

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తమిళనాడులోని వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళి వెంకటసుబ్బు తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి విరాళం డీడీని అందజేశారు.

తిరుమలలో పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్



తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి డిప్యూటీస్పీకర్ రాజవేలు బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

→ రాజవేలు

విద్యాశ్రీశతీర్థ స్వామికి పెద్ద మర్యాద



టీటీడీ పెద్ద మర్యాదతో వ్యాసరాయ మఠాధిపతి విద్యాశ్రీశతీర్థ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అర్చక బృందంతో కలిసి ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకిలో తీసుకెళ్లిన శఠగోపాన్ని అందుకున్న అనంతరం స్వామిజీ మంగళవాయిద్యాలతో తన శిష్యబృందంతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,966

తలనీలాలు సమర్పించినవారు: 21,535



సాంస్కృతిక వైభవం




భారతదేశం అంటే విభిన్న సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు. దేశంలో ఏ మూలకు వెళ్లినా ఏదో కొత్త సంస్కృతి మనల్ని పలకరిస్తుంది. పదుల సంఖ్యలో విభిన్న సంస్కృతులు ఒకే చోట చూసేందుకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వేదికగా నిలుస్తున్నాయి. అయా వాహనాల ముందు దేశ నలుమూలల నుంచి వచ్చిన కళాబృందాల ప్రదర్శనలు భక్తుల మనసును దోచుకుంటున్నాయి. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 15 కళా బృందాలు ఉదయం, రాత్రి అమ్మవారి వాహన సేవల ముందు చేస్తున్న కళారాధన భక్తులను ఆకట్టుకుంటోంది. ఒక పూటకు సుమారు 500మంది కళాకారులు వాహన సేవలో పాల్గొంటారు. ఏపీ నుంచి కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, మహారాష్ట్ర నుంచి పాండురంగ నృత్యం, కేరళ నుంచి డ్రమ్స్, మణిపూర్ సాంప్రదాయ నృత్యాలు అమ్మవారి వాహనసేవలో కళారాధన చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ యేడాది తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ, గిరిజన తెగలు, ఆదివాసీలు పండుగ పబ్బాల్లో చేసే గుస్సాడీ, లంబాడీ, కోయ, గోండు నృత్యాలు జానపద కళారూపాలను ప్రతిబింబిస్తున్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



'సివిల్స్' ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్ష-2026కు సంబంధించి ఉచిత కోచింగ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు అత్యుత్తమ కోచింగ్, పుస్తకాలు, భోజనం, వసతి ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటికోసం ఈ నెల 26వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఘాట్‌రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేకాభిషేకం


భక్తులకు అన్నప్రసాదం పెడుతున్న అదనపు ఈవో

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అలిపిరి కాలినడకమార్గంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీవారి ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంను అదనపు ఈవో సన్మానించారు.

ర్యాపిడో పేరుచెప్పి బైకులో తీసుకెళ్లి

- భక్తుడిపై మందుబాబుల దాడి
- మెడలో ఉన్న గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో.. అంటూ బైకులో ఎక్కించుకున్నాడు. దూరంగా పొదల్లోకి తీసుకెళ్లి మరికొందరు మందబాబులతో కలిసి ఆ భక్తుడిపై దాడిచేసి బంగారు గొలుసు లాక్కెళ్లారు. తిరుపతిలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అలిపిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీకాకుళంకు చెందిన శ్రీధర్, నెల్లూరు వైఎస్‌ఆర్ కాలనీలో ఉంటున్న ఓ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనం కోసం రెండు రోజుల క్రితం తిరుమలకు వచ్చారు. అక్కడ దర్శనం చేసుకుని ఉపాధ్యాయనగర్‌లో రూము అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత నెల్లూరుకు చెందిన భక్తులు వెళ్లిపోయారు. శ్రీధర్ మాత్రం రైల్వే స్టేషన్‌కు వెళ్ళడానికి ఉపాధ్యాయ నగర్‌లోని బస్టాపు వద్ద నిలబడి ఉన్నారు. ఇతడిని గమనించిన ఓ వ్యక్తి రాపిడో పేరుతో మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకున్నాడు. కొంతదూరంలోని ముళ్లపొదల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మద్యం తాగుతున్న తన స్నేహితులతో కలిసి శ్రీధర్‌పై దాడి చేశారు. అతడి మెడలో వున్న దాదాపు నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుడి కేకలతో స్థానికులు వచ్చారు. వీరిచ్చిన సమాచారంతో అలిపిరి ఎస్‌ఐ లోకేష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఐదుగురు పరారయ్యారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.


సమాపనోత్సవంలో పాల్గొన్న పద్మావతి, ద్రవిడ యూనివర్సిటీల వీసీలు ఉమ, దొరస్వామి తదితరులు

- సామాన్య ప్రజల చెంతకు

పుస్తక విజ్ఞానాన్ని చేర్చాలి

లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో వక్తల మనోభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుస్తక విజ్ఞానాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత గ్రంథాలయాలపై ఉందని పలువురు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రంథాలయాల పాత్రపై మూడు రోజులుగా ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో చేపట్టిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) సలహాదారు డాక్టర్ జగదీష్ అరోరా మాట్లాడుతూ.. కాలానుగుణంగా గ్రంథాలయాలను సాంకేతికరించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు తమవంతు పాత్రను పోషించాలని కోరారు. శిథిలమవుతున్న పుస్తకాలను డిజిటలైజ్ చేయాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ వెన్నం ఉమ కోరారు. తద్వారా ఆయా పుస్తకాల్లోని విలువైన విజ్ఞానాన్ని భవిష్యత్తుతరాలకు అందించాలన్నారు. ఎస్వీయూ రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. లైబ్రరీ సైన్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో పురోగతిని సాధించిందన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో చదువుకున్న వారు ప్రస్తుతం దేశ, విదేశాల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నారన్నారు. ఇన్‌ఫ్లిబ్‌నెట్ జాయింట్ కన్వీనర్ రాజా మాట్లాడుతూ.. విజ్ఞానానికి సాంకేతికతను జోడించాలని సూచించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ సేవుకన్ మాట్లాడుతూ.. పరిశోధనల్లో ప్రమాణాలను పెంచడానికి గ్రంథాలయాలు తోడ్పడాలని కోరారు. అంతర్జాతీయ సదస్సు విజయవంతానికి సహకరించిన వారికి సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ సురేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచీ హాజరై పేపర్, పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్ చేసిన ప్రతినిధులను అభినందించారు. దేశ, విదేశీ ప్రతినిధులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు.

సదస్సు తీర్మానాలివే..

- 2047 నాటికి జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడానికి జాతీయ గ్రంథాలయ విధానాన్ని రూపొందించాలి.
- గ్రంథాలయ అధికారులు, సిబ్బందికి ఇన్-సర్వీస్ శిక్షణను అందించాలి.
- లైబ్రరీ సైన్స్ ఇంటర్న్‌షిప్‌ను క్రమబద్ధంగా నిర్వహించి విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి.
- లైబ్రరీ సైన్స్ పాఠ్యాంశాల్లో మార్పు చేర్పులు చేపట్టాలి.
- పీజీ స్థాయిలో అన్ని సబ్జెక్టుల్లో లైబ్రరీ సైన్స్ పేపర్ పెట్టాలి.
- గ్రంథాలయ పరిశోధన మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.
- ప్లాగరిజంపై అవగాహన పెంచడానికి లైబ్రేరియన్లు-లైబ్రరీసైన్స్ విభాగాలకు ఓరియెంటేషన్ నిర్వహించాలి.
- ఉచితంగా లభించే ప్రచురణలు, స్వయం వంటి ఓపెన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాలి.



ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సమీపంలో బోదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసుల తనిఖీల్లో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టుచేసి 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐలు వినోద్‌కుమార్, లింగాధర్ బృందాలు బుధవారం తెల్లవారుజామున కడివేడు ఫారెస్టు బీట్ పరిధిలోని బోదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వస్తున్న కారు.. పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. అందులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.పట్టుబడ్డ స్మగ్లర్లను, దుంగలతో సహా కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుగా మారి.. నాట్లేసి

కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం పెళ్లకూరు మండలం దిగువ చావాలి గ్రామం వద్ద పొలాల్లో వరి నాట్లు వేసి కర్షకుల్లో నూతనోత్సాహం నింపారు. నాయుడుపేటలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యంలో దిగువ చావాలి గ్రామం వద్ద ఆగారు. పొలాల్లో కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. రైతులు, కూలీలతో మాట్లాడారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలిస్తూ అధిక దిగుబడులు పొందేలా పని చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ సమస్యలపై రైతులిచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి


వరినాట్లు వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

జీవాలు, నాటుకోళ్ల పెంపకంతో రెట్టింపు ఆదాయం

- వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పాడి, పాల ఉత్పత్తుల తయారీ, జీవాలు, నాటుకోళ్ల పెంపకాన్ని చేపట్టడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి పెంపకం, విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీ, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, పోషణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ లైవ్ స్ట్రీమింగ్ ప్రోగ్రామ్‌ను రైతులు వీక్షించే ఏర్పాట్లు చేశారు. వెటర్నరీ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీఈ బి.శోభామణి, డెయిరీ టెక్నాలజీ అసోసియేట్ డీన్ జి.గంగరాజు, సీసీవీఈసీ కోఆర్డినేటర్ కె.సుజాత, వివిధ విభాగాల అధ్యాపకులు, రూరల్ మండల వెలుగు ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

వినియోగంలో లేని బ్యాంకు ఖాతాల నుంచి మీ నగదు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లగా బ్యాంకు ఖాతాల్లో ఏ విధమైన ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఉన్న మీ నగదును తిరిగి పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. 'మీ డబ్బు- మీ హక్కు' గోడపత్రికలను గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మీ డబ్బు మీ హక్కు అనేనినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రజలుతమ పేర్ల మీద ఉన్న ఖాతాల్లో పదేళ్లుగా లావాదేవీలు జరపని నగదును పొందని ఎడల ధృవీకకరణపత్రాలు తీసుకుని మీ నగదు, ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం రిజర్వు బ్యాంకు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో గడచిన పదేళ్లుగా ఎలాంటిఆర్థిక లావాదేవీలు జరపకుండా 5,50,632ఖాతాలోల రూ.112.42కోట్లు నిల్వ ఉంద్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరురవికుమార్, మధుసూదన్, చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనారిటీల సంక్షేమం


సమావేశంలో నియోజకవర్గ ముత్తవల్లి కమిటీ సభ్యులు

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే ముస్లింల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని నియోజకరవ్గ ముత్తవల్లి కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌రహీం అన్నారు. బుధవారం స్థానిక షాదీమంజిల్‌లో బుధవారం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమీద్ పోర్టల్‌పై నియోజకవర్గ పరిధిలోని మసీదు కమిటీ సభ్యులకు అవగాహన కల్పిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మౌజన్లకు, ఇమామ్‌లకు నెలకు రూ.15వేల చొప్పున 12 నెలలకు కలిసి రూ.1.80లక్షలు ఒకేసారి విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, సహకారం అందించినందుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమీద్ పోర్టల్‌లో మసీదుల ఆధీనంలో ఉన్న వక్ఫ్ ఆస్తుల వివరాలను పొందుపరచడం వల్ల అవి అన్యాక్రాంతం కాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మస్తాన్‌బాషా, అమీర్‌బాషా, జిలానీబాషా, అల్లీహుస్సేన్, ముర్తుజా, రియాజ్ అహ్మద్, అమీరుద్దీన్, మౌలానాషఫీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు పైపైకి...!

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో కోడి మాంసం, గుడ్ల ధరలు తగ్గాల్సి ఉండగా... రోజు రోజుకు పెరుగుతుండటంతో మాంసాహారులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో డిసెంబరు నెలాఖరు వరకు అయ్యప్ప భక్తులు మాలలు ధరించి నియమనిష్టలతో ఉంటారు. అలాగే కార్తీక మాసం కావడంతో మహిళా భక్తులు మాంసాహారాన్ని ముట్టరు. ఈ నేపథ్యంలో ఏటా అక్టోబరు రెండో వారం నుంచి డిసెంబరు నెలాఖరు వరకు కోడిమాంసం, కోళ్లు, కోడిగుడ్లు, పొట్టేళ్ల మాసం విక్రయాలు తగ్గి దుకాణాలు వెలవెలపోతుంటాయి. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా నవంబరు మొదటి వారం వరకు కోడిగుడ్డు ధర రూ.5.50 ఉండగా, ప్రస్తుతం రూ.7కు పైగా పలుకుతోంది. అదే విధంగా బాయిలర్ కోడి మాంసం కిలో రూ.180 నుంచి రూ.200 ఉండగా, ప్రస్తుతం రూ.260నుంచి రూ.280 వరకు పలుకుతోంది. ఫారం కోడి మాసం కిలో రూ.160 నుంచి రూ.170 వరకు ఉండగా, ప్రస్తుతం కిలో రూ.230 నుంచి రూ.240 వరకు పలుకుతోంది.

పరమేశ్వరుడికి అభిషేకం


కలశాలలో ద్రవ్యాలు నింపి పూజ చేస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస వేడుకల్లో భాగంగా బుధవారం పరమేశ్వరుడికి 108 రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ముందుగా ఆలయం ఎదుట 108 కలశాలు పెట్టి అష్టోత్తర కలశ పూజలు చేశారు. అనంతరం ఆ కలశాలలో ద్రవ్యాలను నింపి వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి పరమేశ్వరుడికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నెంద్రబాకం కృష్ణమూర్తి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతపై అవగాహన

వెంకటగిరి టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల్లో విద్యార్థినులకు మహిళ సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి మాట్లాడుతూ విద్య, విశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, మహిళలు ఇంటితో పాటు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి లీలావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థినులు

సూళ్లూరుపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెస్, చిత్రలేఖనం, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మృదుల మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు క్రీడలు సహకరిస్తాయన్నారు. లైబ్రేరియన్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది వంకా శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు ప్రాథమిక పాఠశాలలో చిల్డ్రన్స్ డేను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మెహబూబి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి, అంగన్‌వాడి సిబ్బంది రేణుకమ్మ, పద్మ, ఇందిరమ్మ, పెంచలమ్మ, అలేఖ్య, ఉపాధ్యాయులు సుధాకర్, అరుణ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎల్‌ఏపీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెండ్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన నొవక్ ఆకాష్, నితేష్, సూర్యతేజ, భువనేష్‌మీనా ప్రతిభ చూపారని, ఈనెల 22 నుంచి 24 వరకు చంద్రగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.


హాకీలో ప్రతిభచాటిన విద్యార్థులు

కార్తీక పూజలు

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయదుర్గాదేవి ఉపపీఠంలో బుధవారం కార్తీకమాసం సందర్భంగా నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్తీక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశిష్టపూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వంచిపెట్టారు.


కార్తీకదీప పూజల్లో భక్తులు

రహదారి పక్కనే చెత్త

- దుర్వాసనతో వాహనదారుల ఇబ్బందులు
- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని వైనం

తడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తుంటే గ్రామస్థాయిలో మాత్రం పారిశుధ్యం అధ్వానంగా ఉంది. స్థానిక బోడిలింగాలపాడు శివాలయానికి సమీపంలో జాతీయ రహదారి పైనే చెత్త వేస్తున్నారు. ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఇదే దారిలో వెళ్తూ జాతీయ రహదారిపై చెత్త వెయ్యకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అప్పట్లో పంచాయతీ అధికారులు సుమారు లక్ష రూపాయలు ఖర్చుచేసి ఆ చెత్తను కొంతమేర తొలగించారు. అక్కడ ఎవరూ చెత్త వెయ్యకుండా ఇనుప రేకులు ఏర్పాటు చేశారు. అక్కడ చెత్త పారవేసే వారిని గుర్తించి జరిమానా కూడా విధించారు. అయితే అదంతా మూన్నాళ్ల ముచ్చటగా సాగింది. మూడు నెలల నుంచి అక్కడ చెత్త వేయడం మొదలుపెట్టారు. పరిశ్రమలు, హోటళ్ల చెత్తను తీసు కువచ్చి పడేస్తుండటంతో జాతీయ రహదారిపైకి వచ్చేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారి పక్కన చెత్త వెయ్యకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

దేశ ఆర్థికాభివృద్ధికి రైతే వెన్నెముక: పాశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధికి రైతే వెన్నెముక అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా నియో జకవర్గంలోని రైతులకు రెండో విడత నగదు జమ చెక్కులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థిక బలం చేకూర్చడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గ పరిధిలోని 22,217 మంది రైతులకు రూ.14.80 కోట్లు నగదును వారి ఖాతాల్లో జమ కావడంతో వారికి చెక్కు అందజేయడం జరిగింద న్నారు. రైతులకు సాగు ఖర్చులకు సాయం అందించడానికి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాలు ఎంతో దోహదపడతాయన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, తహసీల్దారు ప్రసాద్, టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, పట్టాభిరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలా వతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, బిల్లు చెంచురామయ్య. దువ్వూరు రాజ శేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జలీల్‌అహ్మద్, వాటంబేడు హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పోటుపాళెంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పొలాల్లో ట్రాక్టర్‌తో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు.

తూపిలిపాళెం తీరంలో రుద్రాభిషేక పూజలు



తూపిలిపాళెం తీరంలో మట్టితో శివలింగాలను ఏర్పాటు చేస్తున్న భక్తులు - ఇసుకతో చేసిన శివలింగానికి పూజలు

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్ర తీరంలో కార్తీక మాసం చివరి అమావాస్యను పురస్కరించుకొని బుధవారం శివుడికి రుద్రాభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం భీమేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కుందర్తి సుధాకర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మట్టితో శివలింగాన్ని ఏర్పాటు చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు సముద్రస్నానాలు ఆచరించారు. ఇసుకతో శివలింగాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. సముద్రతీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగం వద్దకు చేరుకొని దోష నివారణ, అమావాస్య పూజలు నిర్వహించారు. సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఎస్ఐ నాగ బాబు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

ప్రతి ఉద్యోగి నిబద్ధతతో లక్ష్యాలను అధిగమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ చంద్రశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ అన్నారు. నాయుడుపేట విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ అంతరాయాలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. లూజ్ లైన్స్ సరిచేయడం, చెట్ల కొమ్మలను తొలగించడం వంటివి పనులను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే రెవెన్యూ వసూళ్లను వేగవంతంగా చేయాలని సూచించారు. ప్రతి ఒక్క అధికారి క్రమశిక్షణ, బాధ్యతతో వ్యవహరిస్తే కిందస్థాయి సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వరప్రసాద్‌రెడ్డి, శేఖర్, శీనయ్య, ఏఏవో శ్రీలత, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్, మురళి, జగదీష్, అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

కాళంగి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం వద్ద కాళంగి రిజర్వాయర్ గేట్లును ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో సూళ్లూరుపేట కాళంగి నది పరివాహక ప్రాంతాలైన వట్రపాలెం తదితర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడు వట్రపాలెం, పడమటి కండ్రిగ ప్రాంతాల్లో పర్యటించారు. కాళంగి నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ అవసరమొచ్చినా వెంటనే మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

బంగారు భవితకు బాటలు

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మహిళలు తమ కుటుంబాల బంగారు భవితకు బాటలు వేసుకోవాలని వెలుగు ఏపీఎం అనీల అన్నారు. మండల పరిధిలోని గూడలి-1 సంఘ బంధంలో బుధవారం సంఘ బంధం అధ్యక్షులు, పొదుపు సంఘాల లీడర్లకు జీవనోపాధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి మహిళ తమ కుటుంబం ఆర్థికంగా, ఆరోగ్యంగా, విద్య, వైద్యంలో ముందు ఉండాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోవాలన్నారు. సమావేశంలో అకౌంటెంట్ బిందు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో బుధవారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉల్సా కస్తూరయ్య యాదవ్, మద్దూరు ఫరూక్‌జోయల్, కనుపూరు జగదీష్, కోటేశ్వర రావు, మునిచంద్ర పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జయంతి

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదప్రజల అభ్యున్నతి కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎనలేని కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, రామకృష్ణారావు, వేమయ్య. సుబ్బరామరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈయూ ఆధ్వర్యంలో పురుషుల దినోత్సవం

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. డిపో ఆవరణలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరాజు, విజయ్ కుమార్, కేసీరాజు, జిలానీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: రైతుకు తీవ్ర గాయాలు

బాలాయపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దుక్కి దున్నుతూ ట్రాక్టర్ బోల్తా పడి రైతుకు గాయాలైన ఘటన బుధవారం మండలంలోని అంబలపూడి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన సముద్రాల చంద్రయ్య సమీపంలోని పొలాల్లో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. అడుసు దుక్కి చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ట్రాక్టర్ కింద ఇరుక్కున్న చంద్రయ్యను స్థానికులు గంటన్నర పాటు శ్రమించి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆక్రమణలను అడ్డుకోండి

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని, అధికారులు ఆక్రమణలను అడ్డుకోవాలని పూర్వ విద్యార్థులు అన్నారు. కళాశాలకు చెందిన ఖాళీ భూములను కొందరు ఆక్రమించి విక్రయాలు సాగిస్తున్నారని, అధికారులు స్పందించి కళాశాల స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

రైతులకు అవగాహన

వెంకటగిరి, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులకు ఉద్యాన, వరి పంటల సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, మెలకువలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మహిళా ఆర్థిక స్వాలంభన, ఉపాధి కల్పనకు చేపట్టవలసిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధిపతి డాక్టర్ శ్రీధర్, శాస్త్రవేత్తలు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన, రైతులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు క్రీడాపోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కరిమున్నీసా, హేమంత్, నవ్య, గణేష్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు, హాసిని యోగా పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, గాంధీ, చందన, కిరణ్మయి అభినందించారు.

కూటమి పాలనలో సస్యశ్యామలం: విజయశ్రీ

పెళ్లకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిగువ చావాలి గ్రామంలో టీడీపీ నాయకుడు నేలవల్లి సిద్దులయ్య నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పాల్గొన్నారు. సాగు పద్ధతులు, పంట దిగుబడులు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. నాట్లు వేసే దగ్గర నుంచి ధాన్యం నూర్పిడి వరకు రైతులకు సూచనలు, సలహాలు అందించాలని వ్యవసాయశాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మన శ్రీధర్, పీఏసీఎస్ అధ్యక్షుడు కేవీనాయుడు, నాయకులు పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, సత్యంరాజు, ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉదయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయిప్రసాద్

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల్లో భాగంగా తాగునీరు, రహదారులు, పర్యా వరణం, పరిశుభ్రత, పచ్చదనం వంటి వనరులు సమకూర్చేలా పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడిచెత్తతో ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, ఏపీవో విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయిని ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ఝాన్సీలక్ష్మీబాయి ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, నిరంజన్‌రెడ్డి, శివ చరణ్, కీర్తన, మేఘన, సింధు, హాసిని తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ


క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ గురించి వివరిస్తున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీపీ గడ్డం అరుణమ్మ, ఎంపీడీవో నారాయణరెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం - పచ్చదనం పెంపొందించడానికి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో పాటు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు తెలిపారు. తిరుపతి, అనంతపురం, చిత్తూరు, కడప, తమిళనాడులోని తిరుత్తణి ప్రాంతాల్లోని ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో పనిచేయాల్సి ఉంటుందని, అభ్యర్థులకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉండాలన్నారు. పది రోజుల్లో ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ సేవా సమితి(రాస్), అన్నమయ్య మార్గ్, తిరుపతి. చిరునామాకు దరఖాస్తులు పంపాలని, వివరాలకు 0877-2242404కు సంప్రదించాలని కోరారు.